E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 16-03-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక:73 || పేజీలు–6 www.ekaburu.com



## ఎల్పీజీ రీఫిల్ బుకింగ్‌లు తగ్గుముఖం

....(మిగతా2లో)

# పాంచ్ నగారా




- పలు రాష్ట్రాల్లోని 8 స్థానాలకు ఉప ఎన్నికలు కూడా.. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల
- బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29న రెండు విడతల్లో.. తమిళనాడులో ఏప్రిల్ 23న ఒకే విడతలో..
- అసోం, కేరళ, పుదుచ్చేరిలో ఏప్రిల్ 9న ఒకే విడతలో పోలింగ్
- ఆయా రాష్ట్రాల్లో అమల్లోకి ఎన్నికల కోడ్: సీఈసీ

....(మిగతా2లో)



## నేటి నుంచి అసెంబ్లీ

- గవర్నర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- గవర్నర్, సీఎం చేతుల మీదుగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ
- తర్వాత బీఏసీ భేటీ.. 20న భట్టి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం
- 6 గ్యారెంటీలకు చట్టబద్ధతపై ప్రైవేటు మెంబర్ బిల్లు: కేటీఆర్
- మూసీ అభివృద్ధిపై చర్చ పెడతామన్న సీఎం.. డ్రగ్స్ కట్టడి అంశమూ చర్చకు వచ్చే అవకాశం
- నేడు సీఎల్పీ సమావేశం

ఈకబురు: హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11.45 గంటలకు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగిస్తారు. ప్రసంగానికి ముందు.. అసెంబ్లీ ఆవరణలో గాంధీ విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని గవర్నర్ శుక్లా ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్, మండలి చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత సభ మంగళవారానికి వాయిదా పడనుంది. ఆ తర్వాత స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన శాసనసభ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) భేటీ అవుతుంది. బడ్జెట్ సమావేశాలకు సంబంధించిన అజెండా ఈ సమావేశంలో ఖరారు కానుంది. మంగళ, బుధ వారాల్లో.. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైన చర్చ, సమాధానం ఉంటాయి. 19న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని విరామం ఇవ్వనున్నారు. ఆ తర్వాత రోజు.. అంటే 20న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టే ఆస్కారం ఉంది. అయితే రంజాన్ పండుగ ఏరోజు వస్తుందన్నదానిపై ఇది ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. ఈ నెల 31లోపు బడ్జెట్‌పైన, శాఖల పద్దులపైన చర్చలను పూర్తి చేసి ద్రవ్య వినిమయ బిల్లునూ ప్రభుత్వం ఆమోదించుకోనుంది.

....(మిగతా2లో)



స్వార్థ ప్రయోజనాల కోసమే

## మీపై 'అవిశ్వాసం'

ఈ-కబురు,ఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానం కేవలం స్వార్థ ప్రయోజనాల కోసమే తప్ప మరొకటి కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ఆ పార్టీలో 'రాజవంశ మనస్తత్వం'లో కూరుకుపోయిన కొందరు వ్యక్తులు ప్రజాస్వామ్య వ్యవస్థలను తమ గుప్పిట్లో ఉంచుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు.

## చమురుపైనే గురి



- ఇరాన్ దేశంలోని సైనిక, ఇతర లక్ష్యాలపై విరుచుకుపడిన ఇజ్రాయెల్
- దిగిరాకుంటే చమురు కేంద్రాలే లక్ష్యమవుతాయన్న ట్రంప్
- ఇరాక్‌లోని అతి పెద్ద అమెరికా ఎంబసీపై ఇరాన్ దాడి
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపైనా క్షిపణులు, బాంబుల వర్షం
- యూఏఈలో పోర్టు నగరాలపై దాడులు చేస్తామంటూ హెచ్చరిక
- హర్మ్యూజ్‌కు పలు దేశాల యుద్ధ నౌకలు వస్తాయని ట్రంప్ వెల్లడి
- అదే జరిగితే వారి భూభాగాల్లోకి చొరబడతామని ఇరాన్ హెచ్చరిక

ఈకబురు: ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ యుద్ధం చమురు చుట్టూనే తిరుగుతోంది. ఇరాన్ చమురు బలాన్ని అడ్డుకుంటే.. ఆ దేశం దిగివస్తుందనేది అమెరికా వ్యూహంగా ఉంది. అదే చమురు రవాణాను పూర్తిగా అడ్డుకుంటే ప్రపంచంపై ఒత్తిడి పెరిగి అగ్రరాజ్యం యుద్ధానికి ముగింపు పలుకుతుందని ఇరాన్ అనుకుంటోంది. శుక్ర, శనివారాల్లో రెండింటి వ్యూహాలు ఈ దిశగానే సాగాయి. ఇరాన్ చమురుకు ఆయువుపట్టయిన ఖర్గ్ ద్వీపంలోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దాడులు చేసింది. ఇరాన్ ఓటమిని అంగీకరించకుంటే అక్కడి చమురు క్షేత్రాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇటు హర్మ్యూజ్ జల సంధిలో చమురు రవాణాకు ఇరాన్ మరిన్ని అడ్డంకులు సృష్టిస్తోంది. దీనిని అడ్డుకోవడానికి పలు దేశాలు యుద్ధ నౌకలను పంపనున్నాయని ట్రంప్ తెలిపారు. అదే జరిగితే ఆయా దేశాల్లోకి చొరబడతామని ఇరాన్ హెచ్చరించింది. మరోవైపు అమెరికా దాడులు చేయడానికి ఉపయోగించుకుంటున్న యూఏఈ నగరాలపై దాడులు చేస్తామని పేర్కొంది. ఆ ప్రాంతాలను ఖాళీ చేయాలని సూచించింది. ఇరాన్‌లోని ఖర్గ్, అబు మూసా ద్వీపాలపై అమెరికా బలగాలు శుక్రవారం విరుచుకుపడ్డాయి. అక్కడి సైనిక స్థావరాలను ధ్వంసం చేశాయి. వైమానిక, నౌకా స్థావరాలు, విమానాశ్రయ కంట్రోల్ టవర్, చమురు సంస్థ హెలిప్యాడ్‌లపై దాడులు జరిగాయి. ఖర్గ్.. ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఈ ద్వీపంలో సైనిక స్థావరాలను ధ్వంసం చేశామని ట్రంప్ ప్రకటించారు. హర్మ్యూజ్‌లో నౌకలను అడ్డుకుంటే చమురు క్షేత్రాలపైనా దాడులు చేస్తామని స్పష్టం చేశారు. అమెరికా దాడులవల్ల ఖర్గ్‌లోని చమురు క్షేత్రాలకు ఎటువంటి నష్టం జరగలేదని ఇరాన్‌కు చెందిన ఫార్స్ వార్తా సంస్థ వెల్లడించింది. దాడులవల్ల 15 పేలుళ్లు చోటుచేసుకున్నాయని తెలిపింది.

....(మిగతా2లో)



## ఉద్యోగులపై రేవంత్ సర్కార్ చిన్నచూపు: హరీశ్

ఈ-కబురు,సిద్దిపేట క్రైం, మార్చి 15 : "కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూస్తున్నది. 35 ఏళ్లు కష్టపడి పని చేసి రిటైర్డ్ అయిన ప్రభుత్వ ఉద్యోగులను రేవంత్ రెడ్డి రోడ్లమీదకు తెచ్చారు. బడా కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లిస్తారు.. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు డబ్బులు ఇస్తారు.. కానీ ఉద్యోగులకు మాత్రం ఇవ్వరు.

## మతతత్వ శక్తుల మాటల మాయలో పడొద్దు

- అన్ని మతాలు ఒక్కటైతేనే రాష్ట్రాభివృద్ధి
- ఈ ప్రభుత్వం మనది నేను మీ సోదరుడ్ని
- రాష్ట్ర ప్రభుత్వ ఇఫ్తార్ విందులో రేవంత్



**ఈ-కబురు:హైదరాబాద్**, : 'ఇది మన ప్రభుత్వం.. నేను మీ సోదరుడిని.. ప్రభుత్వానికి మీ అందరి ఆశీస్సులు కావాలి. మన అందరి మధ్యలో మంట పెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తుంటారు. వారి మాటల మాయలో పడొద్దు. హిందు, ముస్లిం, సిక్కు, క్రైస్తవులు.. మనమందరం సోదరులం. మనం కలిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది. రాష్ట్ర మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

....(మిగతా2లో)



## అసెంబ్లీ సాక్షిగా డ్రగ్స్ టెస్ట్ చేసుకుందామా?

- కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సవాల్

ఈ-కబురు:హైదరాబాద్: 'ఈగల్ టీమ్ దాడిలో బీఆర్ఎస్ మా తిరిగి కాంగ్రెస్ పైనే అభాండాలు వేస్తున్నాడు. రేపట్నుంచి అసెంబ్లీ సమావేశాలున్నాయి.శాసనసభ, మండలి సభ్యులం అందరమూ అసెంబ్లీ సాక్షిగా డ్రగ్స్ టెస్టు చేసుకుందామా?' అంటూ కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు.

....(2లో)



## డ్రగ్స్ కేసులోకి బీఆర్ఎస్‌ను లాగొద్దు

- నేను ఏ పరీక్షకయినా సిద్ధం: కేటీఆర్

ఈకబురు:హైదరాబాద్,: నీచమైన రాజకీయాల కోసం డ్రగ్స్ కేసులోకి బీఆర్ఎస్‌ను లాగడం తగదని, చట్టవిరుద్ధ కార్యకలాపాలను, డ్రగ్స్ వాడకాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.

....(2లో)



## రేపటి నుండి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు

ఈ-కబురు,రాష్ట్రంలోని ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో నేటి నుండి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగనున్నాయి.

## 22 నుంచి యాసంగి రైతు భరోసా

- 3 విడతల్లో 9వేల కోట్ల నగదు బదిలీకి ప్రభుత్వ నిర్ణయం.. ఎకరానికి రూ.6వేలు చొప్పున పెట్టుబడి సాయం



**ఈ-కబురుహైదరాబాద్**, : రైతులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న యాసంగి 'రైతు భరోసా'పై రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం కీలక నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కింద అందించే పెట్టుబడి సాయాన్ని ఈ నెల 22వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. రైతు భరోసా కింద మూడు విడతల్లో మొత్తం రూ.9వేల కోట్ల నగదు బదిలీ చేయాలని నిర్ణయించింది. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో చర్చించిన అనంతరం రైతు భరోసా నగదు బదిలీ షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ఈనెల 22న సీఎం రేవంత్ ప్రారంభిస్తున్నారు. అదే రోజున రైతు భరోసా నగదు బదిలీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తారు.

....(మిగతా2లో)

లైఫ్ సైన్సెస్ రంగంలో

## 300 కోట్ల పెట్టుబడులు



**ఈ ప్రాజెక్టుతో 250 మందికి ఉద్యోగాలు: శ్రీధర్ బాబు**

ఈ-కబురుహైదరాబాద్, : అమెరికాకు చెందిన కేంబ్రిడ్జ్ ఐసోటోప్ లేబొరేటరీస్, స్థానిక కెమ్‌తత్వ చిరల్ సొల్యూషన్స్ సంయుక్తంగా లైఫ్ సైన్సెస్ రంగంలో అధునాతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి.

....(మిగతా2లో)

వివాదాలకు

## కేరాఫ్‌గా రోహిత్‌రెడ్డి!



**నాడు ఫిర్యాదుదారు.. నేడు ప్రధాన నిందితుడు.. మెయినాబాద్ ఫాంహౌస్‌లో 'పైలట్' భిన్న పాత్రలు**

ఈ-కబురుహైదరాబాద్, :ఒకనాడు ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారంటూ పోలీసు యంత్రాంగానికి వేగుగా మారారు.

....(మిగతా3లో)

రాష్ట్రంలో రేవంత్

## అరాచక పాలన

- మూసీ భూములను ప్రపంచ బ్యాంక్‌కు కట్టబెట్టే కుట్ర
- హైడ్రాను అడ్డుపెట్టుకుని పేదల ఇళ్ల కూల్చివేత
- తప్పుడు ప్రచారం చేస్తున్న రంగనాథ్‌ను కోర్టుకీడుస్తా: కవిత



....(మిగతా3లో)

# నేటి నుంచి అసెంబ్లీ

ఆ తర్వాత సమావేశాలను కొనసాగించాలా లేక ముగించాలా అన్నది బీఏసీ భేటీలో నిర్ణయించనున్నారు. కాగా.. ఈ బడ్జెట్ సమావేశాలకు మరో ప్రత్యేకత ఉంది. అదేంటంటే.. శాసనమండలి బడ్జెట్ సమావేశాలు పునరుద్ధరించిన శాసనమండలి హాల్లో జరగనున్నాయి. ఇటీవలే ఈ హాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన సంగతి తెలిసిందే. కాగా.. బడ్జెట్ సమావేశాలకు గవర్నర్ శుక్లాను రాష్ట్రప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం భట్టి ఆహ్వానించారు.

వాడీవేడిగా సమావేశాలు

పలు అంశాలపై చర్చకు అధికార, ప్రతిపక్షాలు అస్త్ర, శస్త్రాలతో సిద్ధమవుతున్న నేపథ్యంలో బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. ముఖ్యం గా ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధతపైన ప్రైవేటు మెంబర్ బిల్లు పెడతామంటూ ఇటీవల బీఆర్ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై సభలో ప్రభుత్వాన్ని నిలదీయాలని బీజేఎల్పీ భేటీ కూడా నిర్ణయించింది. ఇలా ఒకే అంశంపైబీఆర్ఎస్, బీజేపీలు శాసన సభ వేదికగా సర్కారును నిలదీయనుండటం ఆసక్తికరంగా మారింది. అయితే కౌంటర్‌గా.. బీఆర్ఎస్ ఎన్నికల హామీలను.. పదేళ్ల పాలనలో అవి ఏ మేరకు అమలయ్యాయన్నదానిపైన.. ఆ ఆ పార్టీని నిలదీసేందుకు అధికార కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఇదే వేదికగా.. మోదీ ఎన్నికల హామీల అమలుపైనా ప్రశ్నించే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వీటితోపాటు.. పలు ప్రజా సమస్యలు, రైతులు, ఉద్యోగుల సమస్యలపైన ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్, బీజేపీ సిద్ధమవుతున్నాయి. ఆయా అంశాలపై సమాధానం ఇచ్చేందుకు అధికార పక్షం కూడా సమాయత్తమవుతోంది. ఇక.. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌పై ఈగల్ టీమ్ దాడి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డితో పాటు పలువురు డ్రగ్స్ తీసుకున్నట్లుగా తేలిన నేపథ్యంలో రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడిపైనా చర్చ చేపట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీని ఇరుకున పెట్టేందుకు వ్యూహాత్మకంగా ఈ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చే ఆస్కారం ఉందంటున్నారు. ఇక మూసీ అభివృద్ధి ప్రణాళికపైనా శాసనసభలో చర్చ పెట్టి విపక్షాల అభిప్రాయాలను తీసుకుంటామని సీఎం రేవంత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ ప్రణాళికను తప్పుపడుతూ కేటీఆర్ ఇప్పటికే ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు. బీజేపీ సైతం ఈ ప్రాజెక్టును తప్పుపడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో మూసీ అభివృద్ధి ప్రణాళికపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడీవేడిగా చర్చ జరిగే ఆస్కారం ఉంది.

వ్యూహ రచనకు భేటీ..

అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాలను ధీటుగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను నిర్ణయించుకునేందుకు.. సీఎం రేవంత్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్షం సోమవారం భేటీ కానుంది. అసెంబ్లీ కమిటీ హాల్లో మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సమావేశంలో మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్ ఘటన నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షం ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అలాగే రైతుబంధు నిధులను విడుదల చేయనున్న నేపథ్యంలో వివిధ అంశాలకు సంబంధించి.. బీఆర్ఎస్‌పై ఎదురుదాడికి దిగాలనే వ్యూహాన్నే అనుసరించాలన్న భావనలో ఉంది. కాగా.. సమావేశాల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై ఆదివారం అసెంబ్లీ భవనంలోని కమిటీ హాల్‌లో సమీక్షాసమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశాలు సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. ఈసారి నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాలు ఒకే ప్రాంగణంలో జరుగుతున్నందున అదనపు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు తక్షణమే సమాధానాలు పంపాలని అధికారులను, సమావేశాల సమయంలో ధర్నాలు, 'చలో అసెంబ్లీ' వంటి కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆయన కోరారు. సభలు సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారం అందిస్తామని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాఖల మధ్య సమన్వయం కోసం ప్రతి శాఖ నుంచీ ప్రత్యేక అధికారిని నియమిస్తామని వెల్లడించారు.

కీలక బిల్లులకూ ఆమోదం..!

జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించిన ప్రభుత్వం. దీనికి సంబంధించిన బిల్లును ఈ సమావేశాల్లోనే ఆమోదించనునన్నట్లు తెలుస్తోంది. అలాగే ముగ్గురు పిల్లలు ఉన్నా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించేలా పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన బిల్లును ఈ సమావేశాల్లోనే పెట్టి ఆమోదించనున్నట్లు చెబుతున్నారు. తల్లిదండ్రులను ప్రభుత్వ ఉద్యోగులు సరిగా చూసుకోకుంటే వారి వేతనాల నుంచి 1015 శాతం మేర నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసే ఉద్దేశంతో రూపొందించిన బిల్లును ఈ సమావేశాల్లోనే ఆమోదించనున్నట్లు చెబుతున్నారు. ఫామ్ హౌస్ యాక్టుపైనా ఈ సమావేశాల్లోనే చర్చించనున్నారు.

## మతతత్వ శక్తుల మాటల మాయలో పడొద్దు

. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన రంజాన్ ఇఫ్తార్ విందుకు హాజరైన సీఎం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. విలువలు గుర్తు చేసే పవిత్ర మాసం రంజాన్ అన్నారు. ప్రజల్లో సఖ్యత భావం రావాలని, అన్ని మతాల మధ్య సామరస్యం కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పునరుద్ఘాటించారు. ఇదే ఎల్బీస్టేడియంలో క్రికెట్ ఆడిన అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామని, 4శాతం రిజర్వేషన్లలో కీలకపాత్ర పోషించిన షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించామని గుర్తు చేశారు. అలాగే, 8 మంది మైనార్టీలను వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా నియమించామని, క్రికెట్ ప్రపంచకప్‌లో చాంపియన్‌గా నిలిచిన మహ్మద్ సిరాజ్‌ను డీఎస్పీగా నియమించామని, బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగంతోపాటు రూ. 2కోట్ల ఆర్థిక సాయం అందించామని సీఎం వివరించారు. ప్రతీ సంక్షేమ కార్యక్రమంలో మైనార్టీలకు సింహభాగం కేటాయిస్తున్నామని చెప్పారు. సోదరభావం, సమానత్వాన్ని బోధించే ఖురాన్‌ను చదవాలని, ఆచరించాలని సీఎం ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. సమీకృత గురుకులాలతో మైనార్టీలకు లబ్ధి జరగబోతోందన్నారు. 4శాతం రిజ్వేషన్లతో గత 18 ఏళ్లలో రాష్ట్రంలో 22 లక్షల మంది ముస్లింలకు లబ్ధి జరిగిందని, అనేకమంది ఉన్నత విద్య అభ్యసించారని చెప్పారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 90 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తే.. మైనార్టీలకూ లబ్ధి జరిగిందన్నారు. ప్రజల మధ్య గొడవలు సృష్టించేందుకు కొన్ని శక్తులు నిత్యం కుట్రలు చేస్తున్నాయని, రాష్ట్రంలో వారి ఆలోచనలు విజయవంతం కావని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సెక్యులర్ ప్రభుత్వానికి మద్దతు పలకాలని షబ్బీర్ అలీ కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి

## ఎల్‌పీజీ రీఫిల్ బుకింగ్‌లు తగ్గుముఖం

ఈకబురున్యూఢిల్లీ, మార్చి 15: పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో వంట గ్యాస్‌కు కొరత ఏర్పడుతుందన్న ఆందోళనలు చెలరేగి వినియోగదారులు ఎల్‌పీజీ సిలిండర్ల కోసం ఎగబడిన విషయం తెలిసిందే. దీంతో ఎల్‌పీజీ సిలిండర్ల బుకింగ్స్ భారీగా పెరిగాయి. అయితే ఇప్పుడు బుకింగ్‌లు తగ్గుముఖం పట్టాయి. గత శుక్రవారం (13న) 88.8 లక్షల ఎల్‌పీజీ రీఫిల్ బుకింగ్స్ జరగ్గా శనివారం దాదాపు 77 లక్షలకు తగ్గినట్టు ప్రభుత్వం పేర్కొంది. ఆన్‌లైన్‌లో ఎల్‌పీజీ బుకింగ్స్ వాటా 84 శాతం నుంచి 87 శాతానికి పెరిగినట్టు పేర్కొంది. కాగా దేశంలోని అన్ని రిఫైనరీలు అధిక సామర్థ్యంతో పని చేస్తున్నాయని, సరిపోయేంతగా క్రూడ్ ఆయిల్ నిల్వలను నిర్వహిస్తున్నాయని వివరించింది.

## ఉద్యోగులపై రేవంత్ సర్కార్ చిన్నచూపు: హరీశ్

రేవంత్ రెడ్డి కమిషన్ ఇచ్చే వారికి డబ్బులు ఇస్తారు కానీ.. కమిషన్ ఇవ్వని ఉద్యోగులకు డబ్బులు ఇవ్వరు. ఎన్ని ప్రాణాలు పోతే రేవంత్ రెడ్డి కళ్లు తెరుస్తారు?'' అని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీశ్ రావు ప్రశ్నించారు.రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన నిరాహార దీక్షకు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. రిటైర్డ్ బెనిఫిట్స్ రాక 60 మంది చనిపోయారని, దానికి కారణం రేవంత్ రెడ్డే అని ఆరోపించారు. ఎన్నికల ముందు పెండింగ్ డీఏలు ఇస్తామని హామీలు ఇచ్చి మోసం చేశారని ధ్వజమెత్తారు. రేవంత్‌కు మనసు లేదని,



ఉద్యోగుల దాచుకున్న డబ్బు ఇవ్వడానికి మనసు రావడం లేదని విమర్శించారు.

# 22 నుంచి యాసంగి రైతు భరోసా

మూడు విడతలు.. రూ.9,000కోట్లు

రైతు భరోసా నిధుల బదిలీని ప్రభుత్వం మూడు విడతలుగా చేయనుంది. తొలి విడతగా ఈ నెల 22 నుంచి 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,590 కోట్ల నగదు బదిలీ చేయనున్నారు. మొదటి రోజు ఒక ఎకరం భూ విస్తీర్ణం ఉన్న రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.6 వేల చొప్పున నిధులు జమ చేస్తారు. అనంతరం మూడు వారాల తర్వాత రెండో విడతలో రూ.2,650కోట్లు జమ చేయనుంది. ఏప్రి ల్ నెలాఖరులోపు మూడో విడతగా మిగిలిన రూ.2,760 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. కాగా, రైతు భరోసా నిధుల విడుదలపై నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రైతుల తరఫున మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న ప్రభుత్వమని మరోసారి రుజువైందని తుమ్మల పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ పాల్గొన్నారు.

ఎలాంటి కోతలు లేకుండానే..

ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ఎలాంటి కోత లు, షరతులు లేకుండానే అమలు చేసే అవకాశాలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.50 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమికి ఎకరానికి రూ.6 వేల చొప్పున చెల్లించేందుకు సిద్ధమవుతోంది. ఐదెకరాలు, పదెకరాల వరకు పరిమితులు విధిస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి పరిమితులు లేకుండా, వ్యవసాయ భూముల జాబితాలో ఉన్న మొత్తం విస్తీర్ణానికి రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించటం గమనార్హం. సీసీఎల్ ఏ జాబితా, భూభారతి రికార్డులు, వ్యవసాయశాఖ నివేదిక ప్రకారం మొత్తం సాగుభూములకు రైతు భరోసా చెల్లించే అవకాశాలున్నాయి.

రైతులకే తొలి ప్రాధాన్యం

పథకాలు, పాత బకాయిల చెల్లింపులకు నిధులు సర్దుబాటు చేయటం రాష్ట్ర ప్రభుత్వానికి అతికష్టంగా మారింది. రైతుభరోసా ప్రకటనకు ముందు నిధుల సర్దుబాటుపై తీవ్ర చర్చ జరిగింది. రైతు భరోసా, ఉద్యోగులకు బకాయిల చెల్లింపులు, కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు అంశాలపై ముఖ్యమంత్రి, మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగులకు ప్రతి నెలా రూ.850 కోట్ల చొప్పున బకాయిలు చెల్లిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు కూడా యాజమాన్యాలు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాయి. ఈ మూడు కూడా అత్యవసరమయ్యాయి. ఏది వాయిదా వేద్దాం? మొదట ఏ పథకానికి చెల్లింపులు చేద్దాం? అనే చర్చ జరిగింది. చివరకు రైతులకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించారు. దీంతో యాసంగి రైతు భరోసా చెల్లింపులకు మార్గం సుగమం అయ్యింది.



# చమురుపైనే గురి

ఇప్పటిదాకా ఇరాన్‌లోని 15,000 లక్ష్యాలపై దాడులు చేశామని, రోజుకు 1,000కిపైగా లక్ష్యాలపై బాంబులు వేశామని అమెరికా రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో 52 సాంస్కృతిక కేంద్రాలు ధ్వంసమయ్యాయని ఇరాన్ వెల్లడించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తోంది. ఇప్పటిదాకా ఆ దేశంపై జరిగిన దాడుల్లో 800 మందికిపైగా మృతి చెందారు. 8,50,000 మంది నిరాశ్రయులయ్యారు. ఇజ్రాయెల్ దాడుల్లో మొత్తం 26 మంది వైద్య సిబ్బంది మరణించారు. మరో 51 మంది గాయపడ్డారు. శుక్రవారం రాత్రి లెబనాన్‌లోని బుర్జ్ ఖలాయియాలోని ఆరోగ్య కేంద్రంపై వైమానిక దాడి జరిగింది. ఈ ఘటనలో 12 మంది మరణించారు. మన చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకుంటే గల్ఫ్‌లోని చమురు కేంద్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ సంయుక్త మిలిటరీ కమాండ్ హెచ్చరించింది. ఆ దేశాల చమురు, ఆర్థిక, ఇంధన మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. యూఏఈలోని పోర్టులు, డాక్‌యార్డులు, రహస్య కేంద్రాల నుంచి ఖర్గ్ ద్వీపంపై అమెరికా దాడులు చేసిందని, తాము యూఏఈలోని నగరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని హెచ్చరించింది. ఇరాన్‌లోని మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని 24 గంటల్లో ఇజ్రాయెల్ 200 దాడులు చేసింది. ఇందులో క్షిపణి ప్రయోగ కేంద్రాలు, రక్షణ వ్యవస్థలు, ఆయుధ ఉత్పత్తి కేంద్రాలున్నాయి.

**అమెరికా ఎంబసీపై..**

ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై శనివారం ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులను కొనసాగించింది. హార్మూజ్ జల సంధిని మరింతగా మూసివేసింది. ఇరాక్‌లోని బాగ్దాద్‌లో ఉన్న అమెరికా ఎంబసీపై క్షిపణి దాడి జరిగింది. హెలిప్యాడ్ ధ్వంసమైంది. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద అమెరికా ఎంబసీల్లో ఒకటి. దీనిపై ఇరాన్ అనుకూల మిలిటెంట్లు పదే పదే దాడులు చేస్తున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని చమురు కేంద్రంపై ఇరాన్ క్షిపణి దాడి చేయగా రక్షణ వ్యవస్థ అడ్డుకుంది. అయితే ఆ శకలాలు చమురు కేంద్రాన్ని తాకాయి. ఫజైరా పోర్టుపై జరిగిన దాడితో మంటలు చెలరేగాయి. డ్రోన్‌ను అడ్డుకున్నా శకలాలు పడి మంటలు వచ్చాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. యూఏఈపై 9 బాలిస్టిక్ క్షిపణులను, 33 డ్రోన్లను ఇరాన్ ప్రయోగించింది. వీటితో కలిపితే యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిదాకా యూఏఈవైపు 294 బాలిస్టిక్, 15 క్రూజ్ క్షిపణులు, 1,600 డ్రోన్లు దూసుకొచ్చాయి. ఈ దాడుల్లో ఆరుగురు మరణించగా 141 మంది గాయపడ్డారు. దుబాయ్‌లో ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రమైన ఓ భవనంపై దాడి జరిగింది. 24 గంటల్లో ఈ ప్రాంతంలో రెండోసారి దాడి జరగడం ఆందోళన కలిగిస్తోంది. యూఏఈలోని జెబెల్ అలీ, ఖలీఫా, ఫజైరా పోర్టులను ఖాళీ చేయాలని ఇరాన్ హెచ్చరించింది. వాటిపై దాడులు చేస్తామని పేర్కొంది. బహ్రెయిన్‌పై 10 డ్రోన్లను, 3 క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. ఇప్పటిదాకా బహ్రెయిన్‌పైకి 124 క్షిపణులు, 203 డ్రోన్లు దూసుకొచ్చాయి. ఇజ్రాయెల్‌కు డ్రోన్లను సరఫరా చేయడం ద్వారా ఉక్రెయిన్ యుద్ధంలోకి దిగిందని భావిస్తున్నామని జాతీయ భద్రతపై ఇరాన్ పార్లమెంటరీ కమిటీ అధిపతి ఇబ్రహీం అజీజి స్పష్టం చేశారు. ఆ దేశం మొత్తం తమ క్షిపణులు, డ్రోన్ల పరిధిలో ఉందని హెచ్చరించారు. ఇరాన్ దాడుల్లో సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంలో అమెరికా వాయుసేనకు చెందిన 5 విమానాలు దెబ్బతిన్నాయని తెలుస్తోంది. ఈ విషయాన్ని అమెరికా అధికారులు చెప్పినట్లుగా అంతర్జాతీయ వార్తా సంస్థ వాల్‌స్ట్రీట్ జనరల్ తెలిపింది.

**36,469 నివాసాలు ధ్వంసం**

అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా తమ దేశంలోని 36,469 నివాసాలు, 6,179 వాణిజ్య సముదాయాలు దెబ్బతిన్నాయని ఇరాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఫతేమీ మొహజెరానీ తెలిపారు. యుద్ధం కారణంగా 223 మంది మహిళలు, పిల్లలు చనిపోయారని, 2,129 మంది గాయపడ్డారని వివరించారు. అయితే మొత్తం మృతులు, గాయపడ్డ వారి సంఖ్యను ఆమె వెల్లడించలేదు. సైనికపరంగా జరిగిన నష్టాన్నీ తెలియజేయలేదు.

**2,500 మెరీన్ల రాక**

యుద్ధం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పశ్చిమాసియాకు 2,500 మంది మెరీన్లను, ఉభయచర యుద్ధ నౌక యూఎస్ఎస్ ట్రిపోలిని అమెరికా పంపింది. ఇప్పటికే అరేబియా సముద్రంలో 12 యుద్ధ నౌకలు, విమానవాహక యుద్ధ నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్, 8 డిస్ట్రాయర్లు ఉన్నాయి. ఇప్పుడు ట్రిపోలి వస్తే అమెరికా సైన్యానికి మరింత బలం చేకూరుతుంది.

**మధ్యవర్తిత్వానికి సిద్ధం: ఫ్రాన్స్**

లెబనాన్ అధ్యక్షుడు, ప్రధాని, పార్లమెంటు స్పీకర్లతో తాను మాట్లాడానని, ఇజ్రాయెల్‌తో చర్చల కోసం మధ్యవర్తిత్వానికి సిద్ధమని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తెలిపారు. లెబనాన్ యుద్ధంలో మరింతగా కూరుకుపోకుండా చర్యలు చేపట్టాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అనుచిత దాడులను హెజ్‌బొల్లా ఆపాలని, వైమానిక దాడులను ఇజ్రాయెల్ నిలిపేయాలని పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్‌తో నేరుగా చర్చించడానికి లెబనాన్ నేతలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. యుద్ధం ప్రారంభమయ్యాక 2 వారాలపాటు ఇరాన్ అంతటా అమెరికా, ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించాయి. కానీ ఖర్గ్ ద్వీపాన్ని ముట్టుకోలేదు. యుద్ధం 3వ వారంలోకి ప్రవేశించిన వెంటనే అనూహ్యంగా ఖర్గ్‌పై అమెరికా దాడులు చేసింది. దీంతో కొంత ఆందోళన వ్యక్తమైంది. అయితే అక్కడి చమురు క్షేత్రాలను తాకలేదు. ఇరాన్‌కు ఆర్థికంగా వెన్నెముకగా ఖర్గ్ ఉంది. ఆ దేశం ఎగుమతి చేసే చమురులో 90శాతం ఇక్కడి నుంచే వెళ్తోంది. ప్రపంచానికి అవసరమైన చమురులో 4.5శాతం ఇరాన్ ఎగుమతి చేస్తోంది. ఇంత ఉద్రిక్తతల్లోనూ ఖర్గ్‌లో రెండు నౌకల్లో చమురును నింపుతున్నారు.

**హర్మూజ్‌కు పలు దేశాల యుద్ధ నౌకలు!**

హర్మూజ్‌లో కృత్రిమ అడ్డంకుల కారణంగా చైనా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్ ఇబ్బంది పడుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి త్వరలో ఈ దేశాలు తమ యుద్ధ నౌకలను పంపనున్నాయని వెల్లడించారు. యుద్ధ నౌకలను పంపాలని ఆయన బ్రిటన్ తదితర దేశాలకు విజ్ఞప్తి చేశారు. ఈ జల సంధివద్ద బాంబు దాడులతో ఇప్పటికే ఇరాన్‌ను అడ్డుకుంటున్నామని తెలిపారు. ఈ వార్తలను ఇరాన్ విదేశాంగశాఖ మాజీ మంత్రి మనుషెహర్ మొతాకిల్ ఖండించారు. తమ భూభాగంలోకి చొరబాట్లు జరిగితే వారి భూభాగాల్లోకి వెళ్లి దాడులు చేస్తామని హెచ్చరించారు.

**ఇంకో ఐదేళ్లయినా యుద్ధానికి రెడీ: ఇరాన్**

అమెరికాతో చర్చల ప్రసక్తే లేదని భారత్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి అబ్దుల్ మాజిద్ హకీమ్ ఇలాహీ తేల్చి చెప్పారు. ఇరాన్ చర్చలను కోరుకుంటోందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అవసరమైతే ఇంకో ఐదేళ్లు యుద్ధాన్ని కొనసాగించే సత్తా తమకు ఉందని స్పష్టం చేశారు. గతంలో ఎనిమిదేళ్ల పాటు ఇరాన్, ఇరాక్ యుద్ధం జరిగిందని, దీర్ఘకాలిక యుద్ధాలు చేసిన అనుభవం తమకు ఉందని తెలిపారు. తమ దాడుల్లో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారని అమెరికా పేర్కొంది. గుర్తుపట్టలేని విధంగా మొజ్తాబా మారినట్లు భావిస్తున్నామని తెలిపింది. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని అంతం చేయడంపైనే అధ్యక్షుడు ట్రంప్ దృష్టి పెట్టారని స్పష్టం చేసింది. ఈ మేరకు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పెంటగాన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

# పాంచ్ నగారా




ఈకబురు: న్యూఢిల్లీ, : దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా భావిస్తున్న మరో ఎన్నికల ఘట్టానికి నగారా మోగింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదివారం షెడ్యూల్ ప్రకటించింది. దేశంలో అందరి దృష్టి కేంద్రీకృతమై ఉన్న పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29వ తేదీల్లో కేవలం రెండు దశల్లోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. తమిళనాడు, అసోం, కేరళ, పుదుచ్చేరిలో ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. తమిళనాడులో ఏప్రిల్ 23న, అసోం, కేరళ, పుదుచ్చేరిలో ఏప్రిల్ 9న పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల కమిషనర్లు ఎస్ఎస్ సంధు, వివేక్ జోషితో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎన్నికల జరగనున్న నాలుగు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమల్లోకి వస్తుందని సీఈసీ పేర్కొన్నారు. కాగా, ఈ అన్ని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను మే 4న ప్రకటిస్తారు. ఈ ఎన్నికలతోపాటు గోవా, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. గోవా, కర్ణాటక, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు ఏప్రిల్ 9న జరగనుండగా, గుజరాత్, మహారాష్ట్రలో ఉప ఎన్నికలు ఏప్రిల్ 23న నిర్వహిస్తారు.

వివాదాలపై స్పందించబోం..

ఎన్నికల జాబితాలో అనర్హులైన ఓటర్లను తొలగించేందుకు, అర్హులకు అవకాశం కల్పించేందుకు రాజ్యాంగంలోని 326 అధికరణ ప్రకారం ప్రత్యేక విస్తృత ఓటర్ల జాబితా (ఎస్ఐఆర్) సవరణ చేపట్టినట్లు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. స్వచ్ఛమైన ఎన్నికల జాబితా నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాపై వివాదాలు, కేసుల గురించి తాను మాట్లాడబోనన్నారు. ఈ దేశ చట్టాలు, ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. తప్పుడు సమాచారం, డీప్ ఫేక్ వార్తలపై కఠిన చర్యలు తీసుకుంటామని, వాటిని గమనించి ఎఫ్ఐఆర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర నోడల్ అధికారులను నియమించామని చెప్పారు. రాజకీయ పార్టీలు, నేతల ప్రకటనల్ని తాము పట్టించుకోబోమని, వాటికి ప్రతిస్పందించలేమని అన్నారు. ఎన్నికలకు ముందు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు ప్రకటించడంపై స్పందిస్తూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విధాన నిర్ణయాలు తీసుకునే అధికారం ఉందని, కానీ.. ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ఏ నిర్ణయాన్నీ అనుమతించబోమని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ నూటికి నూరుశాతం పారదర్శకత ఉండేలా వెబ్ కాస్టింగ్ జరుగుతుందని, ప్రతి రెండు గంటలకోసారి పోలైన ఓట్ల సంఖ్యను ప్రకటిస్తామని చెప్పారు.

బెంగాల్‌లో తొలిదశకు 30న నోటిఫికేషన్..

పశ్చిమ బెంగాల్‌లో మొదటి దశ ఎన్నికలకు నోటిఫికేషన్ ఈ నెల 30న జారీ అవుతుందని సీఈసీ తెలిపారు. నామినేషన్లు దాఖలు చేయడానికి ఏప్రిల్ 6 చివరి తేదీ అని, ఉపసంహరణ ఏప్రిల్ 9 వరకు చేసుకోవచ్చని అన్నారు. ఏప్రిల్ 23న తొలి దశ పోలింగ్ జరుగుతుందన్నారు. రెండో దశకు ఏప్రిల్ 2న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు, నామినేషన్లు దాఖలుకు చివరి తేదీ ఏప్రిల్ 9 కాగా, ఉపసంహరణకు చివరి తేదీ ఏప్రిల్ 23 అని పేర్కొన్నారు. ఏప్రిల్ 29న రెండోదశ పోలింగ్ జరుగుతుందన్నారు. ఇక తమిళనాడు ఎన్నికలకు మార్చి 30న నోటిఫికేషన్ ప్రకటిస్తారు. నామినేషన్లు దాఖలుకు చివరితేదీ ఏప్రిల్ 6 కాగా, ఉపసంహరణకు చివరి తేదీ ఏప్రిల్ 9. తమిళనాడులో ఏప్రిల్ 23న ఓటింగ్ జరుగుతుంది. కేరళ, అసోం, పుదుచ్చేరిలో ఎన్నికలకు మార్చి 16న నోటిఫికేషన్ జారీ అవుతుంది. నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి తేదీ మార్చి 23.

తమిళనాడు, బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరిలో మొత్తం 824 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17.4 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. వీరిలో అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 6.44 కోట్ల మంది ఓటర్లు ఉండగా, తమిళనాడులో 5.67 కోట్లు, కేరళలో 2.70 కోట్లు, అసోంలో 2.50 కోట్లు, పుదుచ్చేరిలో 9.44 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఐదు రాష్ట్రాల్లో 2.19 లక్షల పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, దాదాపు 25 లక్షల మంది ఎన్నికల అధికారులు ఎన్నికల నిర్వహణలో పాల్గొననున్నారు. 126 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న అసోం అసెంబ్లీ పదవీకాలం మే 20న ముగియనుండగా, 30 నియోజకవర్గాలున్న పుదుచ్చేరి అసెంబ్లీ గడువు జూన్ 15న ముగుస్తుంది. కాగా, 234 నియోజకవర్గాలున్న తమిళనాడు అసెంబ్లీ పదవీకాలం మే 10న, 140 నియోజకవర్గాలున్న కేరళ అసెంబ్లీ పదవీకాలం మే 23న, 294 స్థానాలున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ గడువు మే 7న ముగియనుంది.

## అసెంబ్లీ సాక్షిగా డ్రగ్స్ టెస్ట్ చేసుకుందామా?



తిరిగి కాంగ్రెస్ పైనే అభాండాలు వేస్తున్నాడు. రేపట్నుంచి అసెంబ్లీ సమావేశాలున్నాయి. శాసనసభ, మండలి సభ్యులం అందరమూ అసెంబ్లీ సాక్షిగా డ్రగ్స్ టెస్టు చేసుకుందామా?' అంటూ కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు. కేటీఆర్ బ్యాచ్ డ్రగ్స్‌కు అలవాటై అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారని, ఈ నేపథ్యంలో తమకు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. అందుకే గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి విసిరినట్లుగానే తానూ కేటీఆర్‌కు సవాల్ విసురుతున్నానని చెప్పారు. ఆదివారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణలో డ్రగ్స్ సరఫరరా యథేచ్ఛగా జరిగి యవతరం పాడైందన్నారు. తనలాంటి వారు కొడుకుల్ని జాగ్రత్తగా చూసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పెరిగిపోయిన డ్రగ్ కల్చర్‌కు అడ్డుకట్ట వేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈగల్ టీమ్‌ను వేసిందన్నారు. ఈ క్రమంలోనే ఈగల్ టీమ్ దాడుల్లో రోహిత్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు దొరికారని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అయిన అలవాటును రోహిత్‌రెడ్డి మానుకోలేకపోతున్నాడని మండిపడ్డారు.

## డ్రగ్స్ కేసులోకి బీఆర్ఎస్‌ను లాగొద్దు

డ్రగ్స్, అక్రమ పదార్థాల వాడకానికి వ్యతిరేకిగా ఉండే తన పేరును ప్రతి డ్రగ్స్ కేసులోకి లాగాలని చూస్తే చట్టపరమైన నోటీసులిస్తానని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన హెచ్చరించారు. మాదకద్రవ్యాలు మనుషులను రాక్షసులుగా మారుస్తాయని, బాధ్యతాయుత పదవుల్లో ఉన్న వ్యక్తులు కూడా డ్రగ్స్‌ను వాడటం దురదృష్టకరమన్నారు. డ్రగ్స్ వాడుతున్నవారు, విక్రయిస్తున్న వారినిరాజకీయాలతో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు ఈ పరీక్షలు చేయించుకోవాలన్న మహేశ్‌గౌడ్ సూచనను స్వాగతిస్తున్నామని, అందరం ఈ పరీక్షలకు వచ్చి ఆదర్శంగా నిలుద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## లైఫ్ సైన్సెస్ రంగంలో 300 కోట్ల పెట్టుబడులు

ఈ కంపెనీలు వచ్చే మూడేళ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెడతాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ ఫేజ్--4లో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 250 మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. ఆదివారం సచివాలయంలో తనతో సమావేశమైన రెండు కంపెనీల సీఈవోలు పెట్టుబడులకు అంగీకరించారని చెప్పారు. "కేంబ్రిడ్జ్ ఐసోటోప్ లేబొరేటరీస్, కెమ్‌తత్వల భాగస్వామ్యం అంతర్జాతీయ కంపెనీలకు రాష్ట్రంపై ఉన్న ప్రగాఢ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ పెట్టుబడి ద్వారా అధునాతన కెమిస్ట్రీ, మెటీరియల్స్ రంగాల్లో రాష్ట్ర సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఈ అత్యాధునిక తయారీ కేంద్రంలో ఐసోటోప్ లేబుల్డ్ కాంపౌండ్స్ ఉత్పత్తి అవుతాయి. ప్రాజెక్టు పూర్తయితే దేశం వీటి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోగలుగుతుంది" అని శ్రీధర్ బాబు వివరించారు.

# వివాదాలకు కేరాఫ్‌గా రోహిత్‌రెడ్డి!



తన ఫాంహౌస్‌లో భారీ ఆపరేషన్‌ను తెరవెనుక నుంచి నడిపించి.. తానే ఫిర్యాదుదారుగా ఉన్నారు. ఇప్పుడు అదే ఫాంహౌస్‌లో డ్రగ్స్ కేసులో పోలీసులు జరిపిన ఆపరేషన్‌లో నిందితుడిగా దొరికిపోయారు.. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి. దీంతో విధి వైచిత్రి అంటే ఇదేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2022 అక్టోబరులో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారంటూ ముగ్గురు వ్యక్తులను మెయినాబాద్‌లోని ఫాంహౌస్‌లో అరెస్ట్ చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఆ ముగ్గురు వ్యక్తులు బీజేపీకి చెందిన వారుగా పేర్కొంటూ.. వారిపై కుట్ర కేసును అప్పటి ప్రభుత్వం నమోదు చేసింది. నాటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా రోహిత్‌రెడ్డి పోలీసుల సహకారంతో ఈ ఆపరేషన్‌ను వెనుక ఉండి నడిపారు. బేరసారాలు చేస్తున్నట్లు కథ అంతా నడిపి.. వీటిని కెమెరాల్లో రికార్డు చేయించారు. ఆయన ఫిర్యాదుతోనే ఈ వ్యవహారమంతా నడిచింది. ఇందులో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు.. బీజేపీ సహకారంతోనే ఇది జరిగినట్లు పేర్కొన్నారు. దీంతో అది రాజకీయ వివాదంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాపాడేందుకే ఈ ఆపరేషన్‌ను తాను వెనుక ఉండి నడిపినట్లు అప్పట్లో రోహిత్‌రెడ్డి ప్రచారం చేసుకున్నారు. అంతేకాదు.. ఈ సంఘటన తరువాత ఆయనకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 'వై' క్యాటగిరీతో భద్రత కల్పించింది. ఆ సిబ్బందితో రోహిత్‌రెడ్డి చాలా హడావిడి చేసేవారు. సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటూ భద్రతను దుర్వినియోగం చేశారు.

కండిషనల్ బెయిల్ ఉండగానే..

పైలట్ రోహిత్‌రెడ్డి చాలాకాలంగా వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంటున్నారు. ఆయన ఎమ్మెల్యే కాకముందే 'రోహిత్‌రెడ్డి యంగ్ లీడర్స్' పేరిట ప్రైవేట్ సెక్యూరిటీని ఏర్పాటు చేసుకొని కార్యక్రమాలు నిర్వహించేవారు. రిటైర్డ్ ఆర్మీమెన్ రక్షణార్థం ఆయుధాల లైసెన్స్ ఇవ్వగా.. రోహిత్‌రెడ్డి వారినే పర్సనల్ సెక్యూరిటీగా నియమించుకొని ఆయుధాలను దుర్వినియోగం చేశారని అప్పట్లో తాండూరులో కేసు నమోదైంది. ఆ తర్వాత తాండూరులో భారీ కాన్వాయ్‌తో ప్రజలకు ఇబ్బందులు కలిగించారని న్యూసెన్స్ కేసు కూడా నమోదు చేశారు. తాండూరు రాఘవేంద్రనగర్ కాలనీలో అనుమతుల్లేకుండా షెడ్డు వేశారని పోలీసు బందోబస్తు మధ్య బల్దియా అధికారులు షెడ్డును కూల్చారు. అనంతరం ఎమ్మెల్యే అయిన తర్వాత రోహిత్‌రెడ్డిపై హైదరాబాద్‌లో ఇంటలిడెక్స్ కంపెనీ చెక్‌బౌన్స్ కేసు నమోదు చేసింది. ఇవే కాకుండా.. బెంగళూరులో ఓ సినీ నిర్మాత ఇచ్చిన డ్రగ్స్ పార్టీలో పాల్గొన్నారన్న ఆరోపణలపై అక్కడి పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఇటీవల మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలోకి ఎమ్మెల్యేను ఎలా అనుమతించారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ సందర్భంలో పోలీసులను నెట్టివేయడంతో రోహిత్‌రెడ్డిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదైంది. ఆయనను అరెస్ట్ చేసేందుకు ఇంటికి వెళ్లగా అజ్ఞాతంలో ఉండి హైకోర్టు నుంచి కండిషనల్ బెయిల్ తెచ్చుకున్నారు. ప్రతి సోమవారం తాండూరు పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని చెప్పింది. దేశం విడిచి వెళ్లకుండా పాస్‌పోర్టును సీజ్ చేసింది. సోమవారం తాండూరు పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాల్సి ఉండగా.. ఫాంహౌస్‌లో డ్రగ్స్ కేసులో పట్టుబడి పోలీస్ కస్టడీకి వెళ్లారు.

పుట్టా కు పలు వ్యాపారాలు

మొయినాబాద్ ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీలో పోలీసులకు పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్.. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన టీటీడీ మాజీ చైర్మన్, టీడీపీ నేత పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో మహేశ్‌కుమార్ ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి గెలిచారు. టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్యను మహేశ్‌కుమార్ వివాహమాడారు. తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కూడా ఆయనకు బంధుత్వం ఉంది. మహేశ్‌కుమార్‌కు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిస్టిలరీ కంపెనీలతోపాటు పలు వ్యాపారాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయన పీఎస్‌కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ అనే సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతోపాటు పీవీఎల్ మైన్స్ అండ్ మినరల్స్, నాంది కన్‌స్ట్రక్షన్ వంటి సంస్థల్లో భాగస్వామిగా ఉన్నారు. రాజస్థాన్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే నితీష్ శర్మతో కూడా మహేశ్‌కుమార్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి.

# రాష్ట్రంలో రేవంత్ అరాచక పాలన



ఈకబురుహైదరాబాద్, :రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అరాచక పాలన సాగిస్తున్నారని, హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తూ మరో మోదీలా వ్యవహరిస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా పేదల ఇళ్లపైనే ప్రతాపం చూపిస్తోందని, పెద్దవాళ్ల జోలికి వెళ్లడంలేదని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన పేరిట ప్రజాధనం దోచుకోవాలని చూస్తున్నారని, ఈ ప్రాజెక్టును ప్రపంచ బ్యాంక్‌కు తాకట్టు పెట్టేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇళ్లు కోల్పోతున్న బాధితులతో కాకుండా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, ప్రపంచబ్యాంక్ ప్రతినిధులతో సమీక్షలు నిర్వహించడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా గత ప్రభుత్వం రివర్ బెడ్‌లో 30లక్షల చదరపు అడుగుల నిర్మాణాలకు సంబంధిత శాఖలు అనుమతి ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం ఫేజ్ 1లోనే 18లక్షల చదరపు అడుగుల నిర్మాణా లు చేపట్టేందుకు ఎలా అనుమతి ఇచ్చారని నిలదీశారు. వెలుగుమట్లలో 750 ఇళ్లను కూల్చివేసిన ప్రభుత్వం, బాధితులందరికి న్యాయం చేయడంలో విఫలమైందన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ధర్మ సమాజ్ పార్టీ, తెలంగాణ జాగృతి తరఫున పోరాటం కొనసాగిస్తామన్నారు. తమపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు. ఓ ప్రముఖ భవన నిర్మాణ సంస్థ 0.37ఎకరాలు ఆక్రమించిందం టూ గతంలో హైడ్రా కమిషనర్ రాసినలేఖ ఆధారంగానే, ఇప్పుడు దానిపై తాము ధర్నా చేస్తే తప్పుడు వీడియోలతో ఎదురుదాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాకు సంబంధించి సోషల్‌మీడియాలో హైడ్రా పెట్టిన వీడియోల ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. నిజంమాట్లాడే వాళ్లదే తప్పు అన్నట్టుగా వీడియోలు ఎడిట్‌చేస్తారా?అని ప్రశ్నించారు. ప్రభుత్వం, హైడ్రా యం త్రాంగం ఏమైనా 'గ్రాఫిక్స్ డిజైనర్లా, కంటెంట్ క్రియేటర్లా?'అంటూ విమర్శించారు.

## స్వార్థ ప్రయోజనాల కోసమే మీపై 'అవిశ్వాసం'



విపక్ష తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో ఆదివారం ఓం బిర్లాకు ప్రధాని లేఖ రాశారు. "అవిశ్వాస తీర్మానాన్ని తిరస్కరిస్తూ నిర్ణయాత్మకంగా వ్యవహరించి ప్రతిపక్షాల రాజకీయ దుష్ప్రవర్తనను తిప్పికొట్టిన సభ్యులను నేను అభినందిస్తున్నాను. తీర్మానం వీగిపోయాక పార్లమెంటరీ చరిత్ర, స్పీకర్ విధులు, నియమాల ప్రాధాన్యంపై సభలో మీరు చేసిన ప్రకటన శ్రద్ధగా విన్నాను. మీ సంయమనం, ఓర్పు అభినందనీయం" అని పేర్కొన్నారు. ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ లేఖను స్పీకర్ ఓం బిర్లా 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. "భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సంప్రదాయాలు, నియమ నిబంధనలపై మీరెప్పుడూ అచంచల విశ్వాసం చూపించారు. మీ ఈ సందేశం ప్రజాప్రతినిధులు అందరికీ స్ఫూర్తిదాయకం. మన స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ రచయితలు వేసిన నైతిక పునాదిని ఇది బలోపేతం చేస్తుంది" అని ఓం బిర్లా ప్రధానికి బదులిచ్చారు.

సభా నియమాలపై పార్టీలకు స్పీకర్ లేఖలు

లోక్‌సభలో కొందరు సభ్యులు బ్యానర్లు, ప్లకార్డులు, పోస్టర్లు ప్రదర్శిస్తూ అనుచిత వ్యాఖ్యలకు దిగడంపై స్పీకర్ ఓం బిర్లా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సభలో సభ్యులందరూ క్రమశిక్షణను, ఉన్నత నైతిక ప్రమాణాలను పాటించేలా చూడాలని కోరుతూ అన్ని రాజకీయ పార్టీల నేతలకు ఆయన లేఖలు రాశారు. ప్రజాస్వామ్య సంస్థల గౌరవం, ప్రతిష్ఠను కాపాడుకోడానికి తీవ్రంగా ఆలోచించి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అందులో పేర్కొన్నారు

## వచ్చే ఆరు రోజులపాటు
# తెలంగాణలో వర్షాలు



ఈకబురు: హైదరాబాద్: తెలంగాణలో వచ్చే ఆరు రోజులపాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు ఈ నెల 1621వ తేదీల మధ్య కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్, హైదరాబాద్, నల్గొండ జిల్లాల్లో మొదలై మంగళ, బుధవారాల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మరికొన్ని చోట్లకు విస్తరిస్తాయని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 'పసుపు(10సెం.మీ లోపు)' రంగు హెచ్చరికలు జారీ చేసింది. మహారాష్ట్ర నుంచి కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు ఒక ద్రోణి కొనసాగుతోందని తెలిపింది. 21వ తేదీ వరకు రాష్ట్రంలో ఎండల తీవ్రత కాస్త తగ్గుముఖం పట్టనున్నట్లు అధికారులు సూచిస్తున్నారు.

# వచ్చే ఎన్నికల్లో 51 మంది మహిళా ఎమ్మెల్యేలు



ఈకబురు: హైదరాబాద్: మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో 51 మంది మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ఇక నుంచి చేపట్టబోయే పదవుల భర్తీలో 20 శాతం మహిళలకు ఇవ్వాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. ఆదివారం గాంధీ భవన్ ప్రకాశం హాల్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. 'భారాస పదేళ్ల పాలనలో డ్రగ్స్, గంజాయి, కొకైన్‌లను పెంచి పోషించి రాష్ట్రాన్ని డ్రగ్స్ మయంగా మార్చింది. కాంగ్రెస్ హయాంలో మహిళా సంక్షేమమే కేంద్రంగా ప్రజా పాలన సాగుతోంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో మహిళలు పోటీ చేసే అవకాశం కల్పించాం. మహిళల్ని రాష్ట్రపతి, గవర్నర్, స్పీకర్, ముఖ్యమంత్రులను చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ఎర్రబెల్లి స్వర్ణ నేతృత్వంలో గడప గడపకు వెళ్లి వివరించాలి' అని చెప్పారు. అల్కా లాంబ మాట్లాడుతూ..

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఐకమత్యంతో పనిచేయాలని సూచించారు. ఎంపీ కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుండి ఏప్రిల్ 23 వరకు
# ఒంటిపూట బడులు

ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలల పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. పదోతరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న స్కూళ్లు, పరీక్షలు జరిగే రోజుల్లో మాత్రమే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయని అధికారులు చెబుతున్నారు. పరీక్షలు లేని రోజుల్లో పాఠశాలలు ఉదయం పూట యథావిధిగా కొనసాగుతాయి. ఈ ఒంటిపూట బడులు 202526 విద్యా సంవత్సరం చివరిరోజైన ఏప్రిల్ 23 వరకు కొనసాగుతాయి.

# రాహుల్ గాంధీకి అది కూడా తెలియదా?: అమిత్ షా



ఈకబురు భాజపా, ప్రధాని మోదీని వ్యతిరేకించే క్రమంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. దేశాన్ని అపఖ్యాతి పాలు చేసేందుకు యత్నిస్తున్నారని కేంద్రమంత్రి అమిత్ షా ఆరోపించారు. ఆయన చర్యలకు ఏ భారతీయుడూ మద్దతు ఇవ్వడని పేర్కొన్నారు. అస్సాం పర్యటనలో భాగంగా వైద్యారోగ్య రంగంలో రూ.2 వేల కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు కేంద్రమంత్రి ఆదివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గత పాలనపై విమర్శలు చేశారు. "అస్సాం లో కాంగ్రెస్ తన 15 ఏళ్ల పాలనలో వైద్యారోగ్య రంగానికి సంబంధించిన బడ్జెట్ నుంచి ఏటా రూ.150 కోట్లు కాజేసింది. ఆ సమయంలో ఆరోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఆ పార్టీ కేవలం తమ నేతల కుటుంబాల ఆర్థిక ప్రయోజనాల కోసమే పనిచేసింది" అని అమిత్ షా ఆరోపించారు. సమాజంలోని అన్ని వర్గాలకూ అందుబాటు ధరల్లో వైద్య సేవలు లభించేలా భాజపా కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని వైద్య సదుపాయాలను గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల స్థాయికి తీర్చిదిద్దారని సీఎం హిమంత బిశ్వశర్మను అభినందించారు. ఇటీవల దిల్లీలో ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసన చేపట్టిన వ్యవహారంపై అమిత్ షా మండిపడ్డారు. అదేవిధంగా పార్లమెంట్ మెట్లపై నిలబడి రాహుల్ గాంధీ చాయ్, పకోడీలు తీసుకోవడాన్ని కూడా ఖండించారు. పార్లమెంట్ అనేది ప్రజాస్వామ్యానికి పవిత్ర ప్రదేశమని, అల్పాహారం ఎక్కడ తీసుకోవాలో కూడా ఆయనకు తెలియదా? అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో అమిత్ షా పర్యటించడం నాలుగు నెలల్లో ఇది నాల్గోసారి.

## మహిళ అభ్యున్నతే..
# దేశానికి శ్రీరామరక్ష



ఈకబురు: మహిళ అభ్యున్నతే దేశానికి శ్రీరామరక్ష అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు అన్నారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు మరియు కార్యనిర్వాహక అధ్యక్షురాలు డాక్టర్ శివలెంక నాగ ఉదయలక్ష్మి ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ మరియు సంఘమిత్ర అసోసియేషన్ ఫర్ ఫిజికల్లీ ఛాలెంజ్ సౌజన్యంతో నిర్వహించించ హైదరాబాద్ అబిడ్స్ సూర్య లోక కాంప్లెక్స్ పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల లో అభివృద్ధి చెందాలని అప్పుడే దేశము అభివృద్ధి చెందుతుందని అదే దేశానికి శ్రీరామరక్ష అందుకుగాను తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఎదురవుతున్న పరిణామాలను చూస్తే నరేంద్ర మోదీ వంటి నాయకులు దేశానికి ఎంత అవసరము ప్రస్తుత యుద్ధ వాతావరణంలో మోడీ అన్ని దేశాలను కలుపుకుంటూ శాంతి కోసం చేస్తున్న ప్రయత్నాలు అనితర సాధ్యం అని తెలిపారువివిధ రంగాల్లో సేవ చేసిన మహిళలను సత్కరించారు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బాలకృష్ణ మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్న ఈ సభలో సీనియర్ పాత్రికేయులు డాక్టర్ సూర్య ప్రకాష్ అధ్యక్షత వహించారు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ అంజని దేవి వివిధ రంగాల్లో సేవ చేసిన మహిళా మణులను పరిచయం చేశారు దివ్యాంగుల నాయకులు గంగారాం నాగభూషణ్ దివ్య సమస్యలను వివరించారు ఈ సందర్భంగా రామచంద్ర రావు ఐపిసి పార్టీ దివ్యంగా విభాగం తెలంగాణ అధ్యక్షురాలు శారదకు కృత్రిమ కాలును అందజేశారు. అలాగే వివిధ రంగాలలో నిష్ణాతులైన 19 మంది మహిళా మూర్తులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు ఈ సందర్భంగా ఆయన మోదీ నాయకత్వంలో బీజేపీ కులమత ప్రాంతాలకు అతీతంగా మహిళా అభ్యున్నతి కోసం చేస్తున్న కృషిని వివరించారు.సభకు అధ్యక్షత వహించిన సీనియర్ పాత్రికేయులు ఎస్వీ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ యుద్ధ వాతావరణంలో ప్రధాని మోదీ ప్రదర్శిస్తున్న రాజనీతి అనితర సాధ్యమని ఆయన స్థానంలో ఇంకెవరు ఉన్నా దేశ పరిస్థితి అల్లకల్లోలంగా ఉండేదని అన్నారు.ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కే బి శ్రీధర్ మాట్లాడుతూ రామచంద్ర రావు వంటి ప్రతిభాశాలి సాత్వికులు అయిన నాయకులతో కలసి పనిచేయటానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు ఐపీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ లక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగులకు న్యాయం చేస్తూ వారి ప్రయోజనాలను కాపాడే దిశగా ప్రభుత్వం అడుగులువేయలని ఇందుకు రామచంద్రరావు వంటి సమర్థులు చొరవ తీసుకోవాలని కోరారు.అవార్డు గ్రహీతలలో విశాఖ శ్రీకాకుళం నుంచి వచ్చిన అధ్యాపకులు కామేశ్వరి కవయిత్రి శ్రీమణి , ఇంకా సాందీప నీ స్పెషల్ స్కూల్ నిర్వహిస్తున్న లలిత, నాగలక్ష్మి శాంతి విజయవాడనుంచి వచ్చిన సామాజిక కార్యకర్త లోహిత ప్రియ, శ్రేయ వైష్ణవి, కాస్మోలజిస్ట్ డాక్టర్ అక్షయ, సామాజిక సేవకురాలు కత్తుల పద్మ, సంతోషి కమలా ప్రకాశ్ శుభా కర్రా భావిక ప్రియ తదితరులు ఉన్నారుఅంతకు ముందు ప్రముఖ బహుభాషా గాయకుడు లలిత సినీ సంగీత శిక్షకుబారి కాంతారావు తంపా మధురమైన గీతలతో అలరించారు. ఈకార్యక్రమంలో ఐపిసి మహిళా విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పద్మిని జనరల్ సెక్రటరీ పుష్పాంజలి దివ్యాంగ విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శారద మరియు ఐపీసీ పార్టీ కార్యవర్గ సభ్యులు దశరథం నాదెండ్ల సుధాకర్ వాసుదేవరావు రూపా దేవి అల్లాజీ విజయ కనుక దుర్గ కవిత శ్రీనివాస్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిక్స్ లో ఏకాభిప్రాయ గండం!



పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు, ఇరాన్‌అమెరికా మధ్య నెలకొన్న వివాదంపై బ్రిక్స్ కూటమిలో ఉమ్మడి వైఖరిని రూపొందించడం సవాలుగా మారింది. ఈ ప్రాంతంలోని భౌగోళిక రాజకీయ పరిణామాల్లో బ్రిక్స్ సభ్య దేశాలకు నేరుగా ప్రమేయం ఉండటమే దీనికి ప్రధాన కారణమని విదేశాంగ శాఖ వర్గాల సమాచారం.

జైశంకర్‌తో ఇరాన్ విదేశాంగ మంత్రి చర్చలు

ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చి, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో ఫోన్ ద్వారా కీలక చర్చలు జరిపారు. పశ్చిమాసియాలో భద్రత, స్థిరత్వాన్ని పునరుద్ధరించడంలో భారత్ నాయకత్వంలోని బ్రిక్స్ కూటమి చురుకైన పాత్ర పోషించాలని అరాగ్చి ఈ సందర్భంగా ఆకాంక్షించినట్లు చెప్పారు. ఈ ఫోన్ సంభాషణ తర్వాత జైశంకర్ స్పందిస్తూ.. పశ్చిమాసియా పరిస్థితులపై బ్రిక్స్ సభ్య దేశాలతో భారత్ నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని స్పష్టం చేశారు. అయితే, కూటమిలోని కొన్ని దేశాలు ఈ వివాదంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కావడమే ఉమ్మడి ప్రకటనకు అడ్డంకిగా మారినట్లు తెలుస్తుంది.

ఏకాభిప్రాయానికి ఆటంకాలు ఇవే..

బ్రిక్స్ వేదికగా యుద్ధం పరంగా ఒకే మాట వినిపించడం ప్రస్తుతం కష్టతరంగా మారింది. దీనికి కొన్ని అంశాలు అంశాలు కారణమవుతున్నాయి. జనవరి 2024లో బ్రిక్స్‌లో చేరిన ఇరాన్ ఈ వివాదంలో ప్రధాన పక్షంగా ఉంది. మరో సభ్య దేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కూడా ఈ ప్రాంతీయ పరిణామాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. (2023 ఆగస్టులో దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన 15వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఇరాన్‌తో పాటు ఈజిప్ట్, ఇథియోపియా, సౌదీ అరేబియా, యూఏఈలకు సభ్యత్వం కల్పించాలని నిర్ణయించారు) సభ్య దేశాల మధ్య వ్యూహాత్మక ప్రయోజనాలు వేర్వేరుగా ఉండటంతో ఈ సంఘర్షణపై ఒకే రకమైన వైఖరిని తీసుకోవడంలో ప్రతిష్టంభన నెలకొంది.

భారత్ సారథ్యం

బ్రిక్స్ అధ్యక్ష హోదాలో భారతదేశం ఈ సంక్షోభ పరిష్కారానికి తీవ్రంగా కృషి చేస్తోంది. సభ్య దేశాల మధ్య చర్చలను భారత్ సమన్వయం చేస్తోంది. 'మార్చి 12న జరిగిన వర్చువల్ బ్రిక్స్ షెర్పా సమావేశంలో ఈ అంశాలు చర్చకు వచ్చాయి. పశ్చిమాసియాలోని సభ్య దేశాల నాయకులతో భారత అగ్రనాయకత్వం నిరంతరం టచ్‌లో ఉంది' అని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

### ఫ్రీ టికెట్లు అమ్ముకున్న ఎయిరిండియా ఉద్యోగులు..

# 4 వేల మందిపై చర్యలు?




దిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా (Air India) పలువురు ఉద్యోగులపై చర్యలకు సిద్ధమైంది. ఉద్యోగులకు కల్పించే లీజర్ ట్రావెల్ పాలసీని దుర్వినియోగం చేసినందుకుగానూ పెనాల్టీలు విధించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఎయిరిండియాలో ఎంప్లాయీ లీజర్ ట్రావెల్ (ELT) పాలసీ కింద ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, జీవిత భాగస్వాములకు ఉచిత విమాన ప్రయాణ సదుపాయం ఉంటుంది. ఏడాదికి ఇన్ని చొప్పున ఉచిత టికెట్లు అని కేటాయిస్తారు. అయితే, సంస్థ జరిపిన అంతర్గత దర్యాప్తులో కొందరు ఈ పాలసీని దుర్వినియోగం చేసినట్లు తేలింది. తమ కుటుంబ సభ్యులు కానప్పటికీ తమ వారే అని చూపించి ట్రావెల్ పాలసీ ప్రయోజనాలను కొందరు ఉద్యోగులు పొందినట్లు తెలుస్తోంది. కొందరైతే ఉచిత టికెట్లు పొంది.. వాటిని వేరే వ్యక్తులకు అధిక ధరకు విక్రయించిన ఉదంతాలూ దర్యాప్తులో తేలినట్లు సంబంధిత వర్గాలు 'పీటీఐ' వార్తా సంస్థకు వెల్లడించాయి. దీనిపై ఎయిరిండియాను పీటీఐ వివరణ కోరగా.. స్పందన రాలేదు. మొత్తంగా 4వేల మంది ఉద్యోగులు ఈ పాలసీని దుర్వినియోగం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పాలసీ దుర్వినియోగం జరిగినట్లు తెలిసింది. సరిగ్గా ఎంత మంది ఉద్యోగులు ఈ దుర్వినియోగానికి పాల్పడ్డారు? ఈ పాలసీ ద్వారా ఎంత సొమ్ము దుర్వినియోగమైంది? ఏ కాలంలో ఇది జరిగిందీ వంటి వివరాలు పూర్తిగా బయటకు రాలేదు. దీనిపై ఎయిరిండియా చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మోసపూరితంగా ప్రయోజనాలు పొందిన వారి నుంచి సొమ్మును తిరిగి రాబట్టడంతో పాటు, వారిపై పెనాల్టీలు సైతం విధించనుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. పాలసీని దుర్వినియోగం చేసిన వారిలో ఎక్కువ మంది ప్రైవేటీకరణ తర్వాత ఎయిరిండియాలో చేరిన వారే అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో వ్యక్తి పేర్కొన్నారు. 2022లో ఎయిరిండియా ప్రైవేటీకరణ పూర్తి కాగా.. ప్రస్తుతం సంస్థలో 24 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

### ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీకి వార్ షాక్..

## టాప్10 కంపెనీలకు ₹4.48 లక్షల కోట్ల లాస్!



పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ప్రభావంతో గత వారం భారతీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనమయ్యాయి. దేశీయ మార్కెట్‌లోని టాప్10 కంపెనీల విలువ సుమారు రూ.4.48 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. బీఎస్ఈలో సెన్సెక్స్ 4,354.98 పాయింట్లు క్షీణించింది. నిఫ్టీ కూడా 5.31 శాతం నష్టపోయి 1,299.35 పాయింట్ల మేర పతనమైంది. యుద్ధ ప్రభావంతో చమురు నూరు డాలర్లు దాటడం, రూపాయి పతనమవడంతో ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. విదేశీ మదుపర్లు కూడా పెద్ద మొత్తంలో తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండంతో సూచీలపై ఒత్తిడి పడుతోంది. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్‌లో టాప్10 కంపెనీలు తమ విలువలను కోల్పోయాయి. ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ మార్కెట్ విలువ రూ.89,306.22 కోట్లు తగ్గి రూ.9,66,261.05 కోట్లకు చేరింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.61,715.32 కోట్లు క్షీణించి రూ.12,57,391.76 కోట్లకు చేరింది. అలానే బజాజ్ ఫైనాన్స్ రూ.59,082.49 కోట్లు, టీసీఎస్ రూ.53,312.52 కోట్ల చొప్పున నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంకు రూ.42,205.04 కోట్లు, భారతీ ఎయిర్‌టెల్ రూ.38,688.78 కోట్ల చొప్పున మార్కెట్ విలువను కోల్పోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ కూడా రూ.33,289.88 కోట్లు క్షీణించి రూ.18,68,293.17 కోట్లకు చేరింది. అయినప్పటికీ మార్కెట్ విలువపరంగా రిలయన్స్ అగ్రగామిగా కొనసాగుతోంది.

### ఐపీఓ రూల్స్ కు కేంద్రం సవరణలు..

# జియో ఐపీఓకు లైన్ క్లియర్




దిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అయ్యే కంపెనీలు ప్రవేశపెట్టే కనీస పబ్లిక్ ఆఫర్‌కు సంబంధించిన నిబంధనలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సవరించింది. ఇష్యూ అనంతరం మార్కెట్ విలువ ఆధారంగా వాటిని వర్గీకరించింది. సెబీ ప్రతిపాదనల మేరకు సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (రెగ్యులేషన్) అమెండ్‌మెంట్ రూల్స్, 2026ను ఆర్థిక శాఖ తాజాగా నోటిఫై చేసింది. ఇష్యూ అనంతరం మార్కెట్ విలువతో సంబంధం లేకుండా కనీసం 2.5 శాతం వాటాను విక్రయించాలని సూచించింది. తాజా నిబంధనల సవరణతో జియో, ఎన్ఎస్ఈ వంటి ఐపీఓలకు మార్గం సుగమం అయినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇష్యూ అనంతరం రూ.1600 కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల మార్కెట్ విలువ ఉంటే ఆ కంపెనీలు 25 శాతం పబ్లిక్ వాటాను మూడేళ్లలో చేరుకోవాల్సి ఉంటుంది. అదే రూ.1600 కోట్లలోపు ఉంటే 25 శాతం వాటాకు సమానమైన ఈక్విటీ షేర్లను గానీ, డిబెంచర్లను గానీ పబ్లిక్ ఇష్యూ సమయంలోనే విక్రయించాల్సి ఉంటుంది. ఒకవేళ మార్కెట్ విలువ రూ.4 వేల కోట్లలోపు ఉంటే కనీసం రూ.400 కోట్ల విలువైన షేర్లను విక్రయించాల్సి ఉంటుంది.

రూ.4,000 5000 కోట్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీలు 10 శాతం వాటాకు సమానమైన ఈక్విటీ షేర్లు లేదా కన్వర్టబుల్ డిబెంచర్లను జారీ చేయాల్సి ఉంటుంది. లిస్టింగ్ అనంతరం మార్కెట్ విలువ రూ.5 వేల కోట్ల నుంచి రూ.1 లక్ష కోట్లు ఉంటే.. రూ.1000 కోట్లకు సమానమైన (కనీసం 8 శాతం) ఈక్విటీ షేర్లను లేదా డిబెంచర్లను జారీ చేయాల్సి ఉంటుంది. 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధనను ఐదేళ్లలో చేరుకోవాల్సి ఉంటుంది. రూ.1 లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీలు 2.75 శాతం వాటాకు సమానమైన రూ.6250 కోట్ల వాటాను పబ్లిక్ ఆఫర్‌లో విక్రయించాలి. రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ విలువ కలిగిన కంపెనీలు కనీసం రూ.15 వేల కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు, కన్వర్టబుల్ డిబెంచర్లను విక్రయించాలి. లిస్టింగ్ సమయంలో 15 శాతం కంటే తక్కువ వాటాను విక్రయించిన కంపెనీలు తొలి ఐదేళ్లలో 15 శాతం వాటాను విక్రయించాల్సి ఉంటుంది. 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధన చేరుకోవడానికి 10 ఏళ్లు గడువు ఇచ్చారు. అదే లిస్టింగ్ సమయంలో 15 శాతం ఉంటే ఐదేళ్లలో 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను చేరుకోవాల్సి ఉంటుంది. జియో ఐపీఓకు గ్రీన్ సిగ్నల్ ఇలా: పబ్లిక్ ఇష్యూ అనంతరం సంస్థ మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లను మించేటట్లయితే.. ఐపీఓలో 2.5% వాటా మాత్రమే విక్రయించేందుకు కంపెనీలకు అనుమతి ఇవ్వాలని గత సెప్టెంబరులో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిర్ణయించింది. అంతకుముందు నిబంధన ప్రకారం కనీసం 5% వాటాను కంపెనీలు విక్రయించాల్సి ఉంది. ఈ నిబంధన సవరణకు సంబంధించిన నోటిఫికేషన్ ఆలస్యం కావడంతో జియో ఐపీఓ ఆలస్యమవుతూ వచ్చింది. తాజాగా నిబంధనల సవరణతో జియోకు లైన్ క్లియర్ అయ్యింది. జియో కంపెనీ విలువను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు 170 బిలియన్ డాలర్లు (సుమారు రూ.15.50 లక్షల కోట్లు)గా ప్రతిపాదించారు. ఐపీఓ ద్వారా జియోలో 2.5% వాటా విక్రయించినా 4.3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.40,000 కోట్లు) సమీకరించొచ్చని అంచనా వేస్తున్నారు.

### ప్రపంచంలోనే అధికంగా

# వంటగ్యాస్ ఉత్పత్తి చేసే దేశం




భారతదేశంలో సగటు సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేసే ప్రధాన అంశాల్లో గ్యాస్ ధర ఒకటి. ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు నేరుగా భారతీయులపై ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య నడుస్తున్న ఈ యుద్ధం ప్రపంచ ఇంధన మార్కెట్‌ను కుదిపేస్తోంది. ఈ నేపథ్యంలో చాలామంది సౌదీ అరేబియా లేదా రష్యా అతిపెద్ద గ్యాస్ ఉత్పత్తిదారులు అని భావిస్తారు. కానీ అసలు వాస్తవం ఏమిటో.. ప్రపంచంలో ఏ దేశం ఎక్కువగా వంటగ్యాస్ ఉత్పత్తి చేస్తుందో కింద చూద్దాం.

గ్యాస్ సరఫరాకు కీలకంగా హార్మూజ్ జలసంధి

ప్రపంచవ్యాప్తంగా ఎల్‌పీజీ సరఫరాకు హార్మూజ్ జలసంధి అత్యంత కీలకమైన మార్గం. ప్రస్తుత ఉద్రిక్తతల కారణంగా ఈ షిప్పింగ్ కారిడార్‌లో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. రవాణా ఖర్చులు పెరగడం, ఇన్సూరెన్స్ ప్రీమియంలు అధికం కావడంతో భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాల్లో సిలిండర్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి.

అమెరికానే నంబర్ వన్

చాలామంది సౌదీ అరేబియా లేదా రష్యా అతిపెద్ద ఉత్పత్తిదారులు అని భావిస్తారు, కానీ వాస్తవం వేరు. ప్రస్తుతం అమెరికా ప్రపంచంలోనే అగ్రగామి ఎల్‌పీజీ ఉత్పత్తిదారుగా అవతరించింది. అమెరికా ఏటా సుమారు 84 మిలియన్ టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేస్తోంది. అంటే ప్రపంచ మొత్తం ఉత్పత్తిలో దాదాపు 26% వాటా ఒక్క అమెరికాదే.

చైనా 32 మిలియన్ టన్నులు, సౌదీ అరేబియా 26 మిలియన్ టన్నులతో వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి. రష్యా నాలుగో స్థానంలో ఉంది. కెనడా, ఇరాన్, ఖతార్, యూఏఈలు కూడా ఈ జాబితాలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి.

ఎల్‌పీజీ అసలు ఎలా తయారవుతుంది?

ఎల్‌పీజీ అంటే ప్రొపేన్, బ్యూటేన్ వాయువుల మిశ్రమం. ఇది ప్రధానంగా రెండు మార్గాల్లో లభిస్తుంది. భూమి లోపలి నుంచి సహజ వాయువును వెలికితీసేటప్పుడు ప్రొపేన్, బ్యూటేన్‌లను వేరు చేస్తారు. ఇతర మార్గాల్లో రిఫైనరీల్లో ముడి చమురును పెట్రోల్, డీజిల్‌గా మార్చే ప్రక్రియలో ఎల్‌పీజీ ఒక ఉప ఉత్పత్తిగా వస్తుంది.

భారత్ పరిస్థితి ఏమిటి?

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఎల్‌పీజీ వినియోగదారుల్లో ఒకటి. ఉజ్వల యోజన వంటి పథకాలతో గ్యాస్ వినియోగం పెరిగినప్పటికీ మన దేశీయ ఉత్పత్తి డిమాండ్‌కు సరిపోవడం లేదు. భారత్ తన అవసరాల కోసం ప్రధానంగా పశ్చిమ ఆసియా దేశాల నుంచి దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగినప్పుడు లేదా సరఫరా గొలుసు దెబ్బతిన్నప్పుడు దాని ప్రభావం నేరుగా దేశీయ సిలిండర్ ధరలపై పడుతోంది.




# అసలుకు అచ్చుగుద్దినట్లు చేస్తే ఊరుకోం

ప్రపంచవ్యాప్తంగా టిక్‌టాక్, క్యాప్‌కట్ వంటి యాప్‌లతో సంచలనం సృష్టించిన చైనా కంపెనీ 'బైట్‌డ్యాన్స్'కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తన ప్రతిష్టాత్మకమైన ఏఐ వీడియో జనరేషన్ మోడల్ 'సీడ్యాన్స్ 2.0' గ్లోబల్ లాంచ్‌ను కంపెనీ నిరవధికంగా నిలిపివేసింది. హాలీవుడ్ అగ్రశ్రేణి నిర్మాణ సంస్థల నుంచి కాపీరైట్ ఉల్లంఘన నోటీసులు రావడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

వివాదానికి కారణం ఇదే..

సీడ్యాన్స్ 2.0 సృష్టించే వీడియోలు అచ్చం హాలీవుడ్ భారీ బడ్జెట్ చిత్రాలను తలపిస్తున్నాయి. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన కొన్ని క్లిప్స్ చిత్ర పరిశ్రమను విస్మయానికి గురిచేశాయి. అందులో హాలీవుడ్ నటులు బ్రాడ్ పిట్, టామ్ క్రూజ్ మధ్య జరిగిన పోరాట దృశ్యాలు రియలిస్టిక్‌గా ఉన్నాయి. ఐకానిక్ క్యారెక్టర్లుగా పేరున్న స్పైడర్ మ్యాన్, వెనమ్ వంటి సూపర్ హీరోలతో పాటు ప్రముఖ యానిమేషన్ క్లిప్‌లను ఈ ఏఐ మోడల్ అత్యంత నాణ్యతతో సృష్టించింది.

దాంతో తమ మేధో సంపత్తిని అనుమతి లేకుండా ఈ మోడల్‌కు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగించారని హాలీవుడ్ స్టూడియోలు మండిపడుతున్నాయి.

హాలీవుడ్ దిగ్గజాల ధ్వజం

ప్రముఖ నిర్మాణ సంస్థ డిస్నీ గత నెలలోనే బైట్‌డ్యాన్స్‌కు 'సీజ్ అండ్ డెసిస్ట్' (నిలిపివేత) లేఖను పంపింది. తమ కంటెంట్‌ను అనుమతి లేకుండా వాడుకున్నారని డిస్నీ ఆరోపించింది. మరోవైపు, పారామౌంట్ స్కైడాన్స్ సైతం రంగంలోకి దిగింది. 'స్టార్ ట్రెక్, ది గాడ్ ఫాదర్, సౌత్ పార్క్ వంటి మా ఐకానిక్ చిత్రాల హక్కులను బైట్‌డ్యాన్స్ ఉల్లంఘించింది' అని పారామౌంట్ స్పష్టం చేసింది.

సీడ్యాన్స్ 2.0 ప్రస్తుతం చైనాలో మాత్రమే అందుబాటులో ఉంది. ఈ ప్లాట్‌ఫామ్‌ను ప్రొఫెషనల్ ఫిల్మ్ మేకింగ్, ఇ-కామర్స్, అడ్వర్టైజింగ్ రంగాల్లో విప్లవాత్మక మార్పుల కోసం రూపొందించారు. ఒకవేళ ఇది గ్లోబల్ మార్కెట్లోకి వస్తే హాలీవుడ్ ఉనికికే ప్రమాదమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇన్నేళ్లు ఇండస్ట్రీలో కొనసాగుతానని ఊహించలేదు.. మోహన్ బాబు



ఇండస్ట్రీకి వచ్చినప్పుడు 50 ఏళ్ల నట జీవితం ఉంటుందని తాను ఊహించలేదని మోహన్ బాబు (Mohan Babu) అన్నారు. మోహన్ బాబు యూనివర్సిటీ 34వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ కెరీర్‌ను గుర్తుచేసుకున్నారు. "ఇన్నేళ్ల పాటు కెరీర్‌లో కొనసాగుతానని ఎప్పుడూ అనుకోలేదు. 1975 నవంబర్ 22 నా మొదటి సినిమా 'స్వర్గం నరకం' విడుదలైంది. నేను ఒక ఏడాది పాటు సినిమాలు చేస్తానేమో.. తర్వాత అవకాశాలు రావు మళ్లీ నా గ్రామానికి వెళ్లిపోవాలేమో అనుకునేవాడిని. ఈ 50 ఏళ్లలో 560 సినిమాలు చేశాను. ఇంకా చేస్తూనే ఉన్నాను. ఒక సినిమాను మించి మరొకటి ఉన్నాయి. తల్లిదండ్రుల ఆశీస్సులు, ప్రేక్షకుల అభిమానం వల్లే ఈ స్థితిలో ఉన్నాను" అని అన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "ఏం చేయాలి.. ఎలా బ్రతకాలి.. భవిష్యత్తును ఎలా నిర్ణయించుకోవాలి అన్నది మీకు తెలుసు. నేను మీ వయసులో ఉన్నప్పుడు ఈ కంప్యూటర్లు, ఫోన్లు లేవు. కానీ, ఇప్పుడు ఒక్కొక్కరికి రెండు ఫోన్‌లు ఉండడం చూసి నేను ఆశ్చర్యపోతున్నా. మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారు. వాళ్ల ఆశలు నెరవేర్చండి" అని మోహన్ బాబు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల హాజరయ్యారు. ఆయన మోహన్ బాబుపై ప్రశంసలు కురిపించారు. 'ది ప్యారడైజ్' (The Paradise) సెట్‌లో ఆయన (Mohan Babu) ఉంటే ఆ రోజు షెడ్యూల్ అంతా అనుకున్న టైమ్‌కు పూర్తవుతుంది. మిగిలిన రోజుల్లో ఆలస్యమవుతుంది. ఈ సినిమాలో ఆయన పాత్ర గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. అది ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో ట్రైలర్ విడుదలైనప్పుడు మీకే అర్థమవుతుంది" అని చెప్పారు.




## మ్యాజిక్ జరిగింది..
### ముహూర్తం కుదిరింది... ట్రైలర్ అదిరింది

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేట్రికల్ ట్రైలర్ నిన్న విడుదలై యూట్యూబ్‌లో సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే ఈ ట్రైలర్ 14 మిలియన్లకు పైగా వ్యూస్‌తో దూసుకుపోతోంది. ఉగాది పండుగ కానుకగా మార్చి 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో, ట్రైలర్‌పై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసలు కురిపించగా, దర్శకుడు హరీశ్ శంకర్ కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ ట్రైలర్‌పై సోషల్ మీడియా వేదికగా చిరంజీవి స్పందించారు. "మ్యాజిక్ జరిగింది.. ముహూర్తం కుదిరింది.. ట్రైలర్ అదిరింది.. ఉగాదికి "ఉస్తాద్ భగత్ సింగ్" తో అన్నీ శుభాలే!!" అని తనదైన శైలిలో ట్వీట్ చేశారు. పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్, చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.చిరంజీవి ట్వీట్‌కు దర్శకుడు హరీశ్ శంకర్ ఉద్వేగభరితంగా బదులిచ్చారు. విదేశాల్లో ఉన్నప్పటికీ సమయం తీసుకుని ట్రైలర్ చూసినందుకు ధన్యవాదాలు తెలిపారు. "అయ్యబాబోయ్... అన్నయ్య !! మీ టైమింగ్, రైమింగ్ చూస్తుంటే మీకు ట్రైలర్ ఏ రేంజులో నచ్చిందో నాకర్థమైంది. 'మెగా ఆశీర్వాదం' కూడా దొరికింది కాబట్టి ఇక మెరుపు వేగంతో దూసుకెళ్లడమే. ఎందుకంటే.. మీరు ట్వీటు పెడితే...హీటు పెరిగినట్టే!!" అని హరీశ్ శంకర్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ట్రైలర్‌కు వస్తున్న అద్భుతమైన స్పందనకు చిరంజీవి ప్రశంసలు తోడవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. హరీశ్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై రూపుదిద్దుకున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ పాటలు అందించగా, తమన్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ సమకూర్చాడు. ఈ యాక్షన్ థ్రిల్లర్ ఎంటర్టయినర్ మూవీలో పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటించారు.

## నీరా ఆర్య బయోపిక్‌లో?

ది కేరళ స్టోరీ' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటి అదా శర్మ, ఇప్పుడు ఓ సూపర్ ఉమన్ గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ కొత్త చిత్రానికి 'సూపర్ వెల్లి' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు రాజేష్ బచ్చాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అదా శర్మ పాత్ర చాలా భిన్నంగా ఉండనుంది. ప్రపంచాన్ని కాపాడే సూపర్ హీరోలా కాకుండా, తన శక్తులతో ప్రపంచాన్ని నాశనం చేయాలనుకునే సోమరి, గందరగోళ స్వభావం ఉన్న పాత్రలో ఆమె కనిపించనున్నారు. ఇటీవలే విడుదలైన టీజర్‌లో కూడా, ప్రపంచాన్ని రక్షించడం కంటే నిద్రపోవడానికే ఇష్టపడే పాత్రగా ఆమెను చూపించారు. దర్శకుడు రాజేష్ బచ్చాని మాట్లాడుతూ.. "కమాండో సినిమాలో అదా చేసిన భావనా రెడ్డి పాత్ర నాకు గుర్తుంది. ఆమెలోని సహజమైన ప్రతిభ, చురుకుదనం, హాస్యం చూశాక మా 'సూపర్ వెల్లి' పాత్రకు ఆమే సరైన ఎంపిక అనిపించింది. మూడేళ్లుగా ఈ స్క్రిప్ట్‌పై పనిచేస్తున్నాను. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాం" అని తెలిపారు.



## నాగార్జున కాల్ చేస్తే.. కల్యాణి నటించలేదని చెప్పా: ప్రియ



'కొత్త లోక'తో సెన్సేషన్‌గా మారిన మలయాళ నటి కల్యాణీ ప్రియదర్శన్ (Kalyani Priyadarshan). ఇప్పటి వరకూ అత్యధిక వసూళ్లు (రూ.300 + కోట్లు) చేసిన మలయాళ సినిమా ఇదే. ఈ క్రేజీ రికార్డు నెలకొల్పిన కల్యాణి గురించి ఆమె తండ్రి, ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ (Priyadarshan) ఆసక్తికర విషయం చెప్పారు. టాలీవుడ్ మూవీతోనే ఆమె నటిగా ఎలా మారిందో ఓ ఇంటర్వ్యూలో వివరించారు. "కల్యాణి సినిమాల్లోకి వస్తుందని మేం ఎప్పుడూ అనుకోలేదు. ఆమె సినిమా సెట్స్‌కు వచ్చేందుకూ ఇష్టపడేది కాదు. ఆర్కిటెక్ట్ కావాలన్నది తన డ్రీమ్. దాని కోసం ప్రయత్నిస్తుండగా.. ఓరోజు నాగార్జున నాకు కాల్ చేశారు. "హలో!' సినిమాలో హీరోయిన్‌గా మీ అమ్మాయిని అనుకుంటున్నాం' అని అన్నారు. కల్యాణికి నటన రాదని నేను బదులిచ్చా. 'ఒక్కసారి ప్రయత్నిస్తా నాన్నా.. పోయేది ఏముంది? ఒకవేళ సెట్ కాలేకపోతే ఆర్కిటెక్ట్ గా మళ్లీ నా ప్రయత్నాలు నేను చేస్తా' అని చెప్పింది" అని ప్రియదర్శన్ తెలిపారు. కేరళలో పెరగకపోవడం వల్ల కల్యాణి మలయాళం మాట్లాడలేకపోయేదని, దాని వల్ల కెరీర్ ప్రారంభంలో ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. వెనకడుగు వేయకుండా అన్నీ నేర్చుకుని ఈ స్థాయికి చేరుకున్న తన కుమార్తెను చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. అఖిల్ అక్కినేని హీరోగా దర్శకుడు విక్రమ్ కె. కుమార్ తెరకెక్కించిన చిత్రమే 'హలో!' (Hello). దీనికి నాగార్జున నిర్మాత. 2017 డిసెంబరులో విడుదలైంది. ఆ తర్వాత వరుసగా తెలుగు సినిమాలు 'చిత్రలహరి', 'రణరంగం'లో అవకాశాలు అందుకున్న కల్యాణి.. ప్రస్తుతం మలయాళం సినిమాల్లోనే నటిస్తోంది.


### నాపై తప్పుడు కథనాలు..
## ఆ సమయంలో చాలా ఏడ్చేశా



మెగా కోడలు లావణ్య త్రిపాఠి సంచలన కామెంట్స్ చేసింది. తాను కూడా క్యాస్టింగ్ కౌచ్‌కు గురైనట్లు వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన లావణ్య తనకెదురైన చేదు అనుభవాన్ని పంచుకుంది. తాను ఓ తమిళ సినిమా చేయాల్సి వచ్చిందని తెలిపింది. ఆ సమయంలో దర్శకుడి తీరుతో చాలా అసౌకర్యానికి గురయ్యానని వివరించింది. అందువల్లే ఆ సినిమాకు నేను నో చెప్పేశానని లావణ్య త్రిపాఠి పేర్కొంది.ఆ సమయంలో నాకు ఎవరూ కూడా సపోర్ట్ కూడా లేదని లావణ్య తెలిపింది. ఆ తర్వాత నన్ను టార్గెట్‌గా చేసి వేధించారని అన్నారు. నాపై కేసు పెట్టడమే కాకుండా.. తప్పుడు కథనాలు కూడా రాసుకొచ్చారని ఆవేదన వ్యక్తం తెలిసింది. ఆ సమయంలో ఏం చేయాలో తెలియక ఏడ్చేశానని లావణ్య త్రిపాఠి వివరించింది. లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ..'ఒకప్పుడు నేను ఒక తమిళ సినిమా చేయాల్సి వచ్చింది. కానీ ఆ దర్శకుడి తీరు నాకు కరెక్ట్ అనిపించలేదు. నాకు అక్కడ సౌకర్యంగా లేదని అనిపించింది. అందుకే ఆ సినిమాకు నో అని చెప్పా. ఆ తర్వాత వారు నా గురించి వార్తాపత్రికల్లో తప్పుడు కథనాలను ప్రచురించడం మొదలుపెట్టారు' అని చెప్పుకొచ్చింది.

### ఆనంద్ దేవరకొండ బర్త్ డే..
## వదినమ్మ రష్మిక స్పెషల్ విషెస్

ఇటీవలే టాలీవుడ్ జంట రష్మిక విజయ్ దేవరకొండ వివాహబంధంలోకి అడుగుపెట్టారు. ఉదయ్‌పూర్ వేదికగా జరిగిన గ్రాండ్ వెడ్డింగ్‌లో ఈ లవ్ బర్డ్స్ ఒక్కటయ్యారు. ఇరువురి సంప్రదాయ పద్ధతుల్లో వీరిద్దరి పెళ్లి వేడుక గ్రాండ్‌గా జరిగింది. ఈ పెళ్లిలో అత్యంత సన్నిహితులు, బంధుమిత్రులు మాత్రమే సందడి చేశారు. తాజాగా ఇవాళ విజయ్ తమ్ముడు ఆనంద్ దేవరకొండ బర్త్ డే కావడంతో వదినమ్మ రష్మిక స్పెషల్ విషెస్ తెలిపింది. మరిది ఆనంద్ దేవరకొండతో కలిసి డ్యాన్స్ చేసింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ దేవరకొండతో పెళ్లి తర్వాత ఆనంద్ జరుపుకుంటోన్న తొలి పుట్టనరోజు కావడం మరో విశేషం.



## 'ఆస్కార్' వేడుక.. ఏ ఓటీటీలో చూడొచ్చంటే?



తిష్ఠాత్మక 'ఆస్కార్' అవార్డుల ప్రదానోత్సవానికి (Oscars 2026 Ceremony) రంగం సిద్ధమైంది. ఈ వేడుకకు లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్ వేదిక కానుంది. భారత కాలమానం ప్రకారం.. సోమవారం (మార్చి 16) తెల్లవారుజామున 4:30 నుంచి ఈవెంట్ ప్రారంభమవుతుంది. భారత్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని ఓటీటీ 'జియో హాట్‌స్టార్' (Jio Hotstar)లో చూడొచ్చు. స్టార్ మూవీస్ ఛానల్‌లోనూ ప్రత్యక్ష ప్రసారం వీక్షించొచ్చు (Oscars Ceremony Streaming Platform). ఒకవేళ లైవ్ మిస్ అయితే.. ఇదే ఛానల్‌లో రాత్రి 9 గంటలకు చూసే అవకాశాన్ని కల్పించారు. ఈ 98వ ఆస్కార్ అవార్డుల వేడుకకు హాలీవుడ్ కమెడియన్ కోనన్ ఓబ్రియన్ హోస్ట్. గతేడాది నిర్వహించిన ఈవెంట్‌కూ ఆయనే వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ ఈవెంట్‌కు హీరోయిన్ ప్రియాంకా చోప్రా ప్రెజెంటర్‌లలో ఒకరిగా హాజరు కానున్నారు. 24 విభాగాల్లో విజేతలకు పురస్కారాలు అందజేయనున్నారు. ఈసారి కొత్తగా క్యాస్టింగ్ డైరెక్టర్ కేటగిరీని చేర్చారు. 16 నామినేషన్స్‌తో 'సిన్నర్స్' చిత్రం అగ్రస్థానంలో ఉంది.

# రహానేకు మరోసారి అవకాశం!



ఐపీఎల్ 2025 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) దారుణ ప్రదర్శన కనబరిచింది. 14 మ్యాచ్‌ల్లో ఐదు విజయాలకు మాత్రమే పరిమితమయిన కేకేఆర్ 8వ స్థానంలో నిలిచింది. ఆ సీజన్‌లో కేకేఆర్ కెప్టెన్‌గా అజింక్యా రహానే వ్యవహరించాడు. నాయకుడిగా జట్టును నడిపించడంలో విఫలైనప్పటికీ బ్యాటర్‌గా మాత్రం రహానే సూపర్ సక్సెస్‌అయ్యాడని చెప్పొచ్చు. 37 ఏళ్ల రహానే 13 మ్యాచ్‌లాడి 390 పరుగులు సాధించాడు. కేకేఆర్ తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ కూడా రహానేనే కావడం విశేషం. గత సీజన్‌లో ఎక్కువగా వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన రహానే తొలి బంతి నుంచే దూకుడుగా ఆడడం అలవాటు చేసుకున్నాడు. తక్కువ బంతుల్లోనే ఎక్కువ పరుగులు సాధించే స్ట్రాటజీతో ప్రత్యర్థులకు చెమటలు పట్టించాడు. అందుకే ఈసారి కూడా రహానేకే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలనే కృతనిశ్చయంతో కేకేఆర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి మరో 13 రోజులు సమయం ఉండడంతో ఈలోగా కేకేఆర్ కెప్టెన్ పేరును ఖరారు చేయనుంది. అయితే రహానే ఈ సీజన్‌లోనూ వన్‌డౌన్‌లోనే బ్యాటింగ్‌కు రానున్నాడు. ఐపీఎల్‌లో రెండు పర్యాయాలు (2012, 2014) గంభీర్ సారథ్యంలో ఐపీఎల్ ట్రోఫీలు సాధించిన కేకేఆర్ 2024లో శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలో మూడో టైటిల్ అందుకుంది. అయితే అనూహ్యంగా గతేడాది సీజన్ ప్రారంభానికి ముందు జరిగిన వేలంలో శ్రేయస్ అయ్యర్ సహా పలు కీలక ఆటగాళ్లను వదులుకొని కేకేఆర్ మూల్యం చెల్లించుకుంది. కానీ ఈసారి మాత్రం ఆ తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నంలో తమ బ్యాటింగ్ లైనప్‌ను బలోపేతం చేసుకుంది. ఇటీవలే టీ20 వరల్డ్‌కప్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించిన ఫిన్ అలెన్ సహా టిమ్ సీఫెర్ట్, రచిన్ రవీంద్ర, కామెరున్ గ్రీన్‌లను సొంతం చేసుకుంది. అయితే ఇప్పటికే విదేశీ కోటాలో సునీల్ నరైన్, బ్లెస్సింగ్ ముజరబాని, రోవ్‌మెన్ పావెల్, పతిరానా ఉన్నారు. మరి ఇంతమందిలో ఎవరికి అవకాశం వస్తుందనేది చూడాలి. ఇక పేసర్ హర్షిత్ రాణా గాయంతో ఈ సీజన్‌కు దూరమైనట్లు వార్తలు వచ్చాయి. కానీ కేకేఆర్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మార్చి 28న ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో కేకేఆర్ తమ తొలి మ్యాచ్ మార్చి 29న ముంబై ఇండియన్స్‌తో ఆడనుంది.

# ఇది ఆరంభం..

## మున్ముందూ భారత్‌దే ఆధిపత్యం: రోహిత్ శర్మ



ఐసీసీ టోర్నీల్లో ఇటీవల భారత పురుష, మహిళా జట్లు అద్భుతాలు చేశాయి. రోహిత్, సూర్య నాయకత్వంలో వరుసగా రెండు టీ20 ప్రపంచ కప్‌లను నెగ్గింది. హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలో తొలిసారి మహిళా వన్డే ప్రపంచ కప్‌ను సొంతం చేసుకుంది. ఐసీసీ టోర్నీల్లో భారత ఆధిపత్యానికి ఇది ఆరంభం మాత్రమేనని.. మున్ముందూ కొనసాగుతుందని మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆశాభావం వ్యక్తం చేశాడు. ‘‘భారత్ వరుసగా అద్భుతాలు సాధించడం గర్వంగా ఉంది. గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్‌లో టీమ్‌ఇండియా ఆధిపత్యం కొనసాగుతోంది. త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. మున్ముందూ ఇదే దూకుడు కొనసాగుతుందని నమ్ముతున్నా. పురుషుల జట్టు వరుసగా రెండు టీ20 ప్రపంచ కప్‌లను నెగ్గింది. అయితే, మహిళా జట్టుకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నా. తొలిసారి వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. ముంబయి వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను చూడటం చాలా బాగుంది. అయితే, ఇది ఆరంభం మాత్రమే. ఒక్కసారి ఇలాంటి స్థితికి చేరుకున్నాక.. ముందుకు సాగిపోవాల్సిందే. అందరిపై బాధ్యత ఇంకా పెరుగుతుంది’’ అని రోహిత్ వివరించాడు.

కుర్రాళ్లూ వచ్చిన ఛాన్స్‌ను వదలొద్దు

‘‘ఎప్పుడు అవకాశం వచ్చినా.. అందుకోవడానికి సిద్ధంగా ఉండాలి. ప్రతి సవాల్‌ను స్వీకరించాలి. అందుకోసం సన్నద్ధతే కీలకం. జాతీయ జట్టుకు ఎవరినైనా ఎంచుకున్నారంటే దానికి కారణం ఉంటుంది. మన దేశంలో చాలా పోటీ ఉంది. అండర్14 నుంచే కష్టపడాలి. అద్భుతమైన టాలెంట్ ఉన్నా సరే కాస్త అదృష్టమూ కలిసిరావాలి. సరైన సమయంలో మనలోని ఆటగాడిని గుర్తించే వ్యక్తి తారసపడాలి. మీ దగ్గర మంచి నైపుణ్యం ఉన్నా సరే ఎవరికీ చూసే అవకాశం రాకపోతే వృథానే. లక్ ఉండటంతోపాటు.. నిరంతరం శ్రమించడం అంతకంటే ముఖ్యం. కేవలం ముంబయి క్రికెటర్లకు మాత్రమే కాదు.. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని కోరుకునే ప్రతి ఒక్కరికీ ఇదే సూత్రం వర్తిస్తుంది’’ అని రోహిత్ వెల్లడించాడు.

## కేకేఆర్ తప్పు చేసింది..

## శ్రేయస్, సాల్ట్ లను వదులుకోవడంపై కుంబ్లే



ముంబయి: శ్రేయస్ అయ్యర్, ఫిల్ సాల్‌ట్‌లను వదులుకోవడం కోల్‌కతా నైట్‌రైడర్స్ చేసిన తప్పని దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. కీలక ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడం ఎంత ముఖ్యమన్నది అర్థం చేసుకుంటే తప్ప ఐపీఎల్ టైటిల్‌కు కేకేఆర్ గట్టి పోటీదారుగా ఉండలేదని హెచ్చరించాడు. 2024లో శ్రేయస్ నేతృత్వంలో కోల్‌కతా టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాత అతడు, సాల్ట్ ఆ జట్టును వీడారు. శ్రేయస్ పంజాబ్ జట్టులో చేరగా.. సాల్ట్ ఆర్సీబీకి వెళ్లిపోయాడు. దాదాపు దశాబ్దం విరామం తర్వాత నిరుడు పంజాబ్ ఫైనల్ చేరగా.. ఆర్సీబీ తొలిసారి టైటిల్‌ను గెలుచుకుంది. ‘‘రెండేళ్ల కింద కేకేఆర్ ఐపీఎల్ విజేతగా నిలిచింది. మూడోసారి టైటిల్‌ను గెలుచుకుంది. ఆ విజయంలో శ్రేయస్, సాల్‌ట్‌లది కీలక పాత్ర. కానీ కోల్‌కతా ఆ ఇద్దరినీ వెళ్లిపోనిచ్చింది. ఆటగాళ్లను అట్టిపెట్టుకునే విషయంలో కోల్‌కతాకు నిలకడ లేదు. శ్రేయస్, సాల్‌ట్‌లను వదులుకోవాలన్న కేకేఆర్ నిర్ణయం తప్పు’’ అని కుంబ్లే చెప్పాడు. రహానె రూపంలో అనుభవజ్ఞుడైన కెప్టెన్ కేకేఆర్‌కు ఉన్నా.. కెప్టెన్‌గా అతడు ఇంకా టైటిల్ గెలవలేదని కుంబ్లే అన్నాడు. శ్రేయస్ నాయకత్వపటిమపై అతడు ప్రశంసలు కురిపించాడు.

# కోహ్లీ అత్యుత్తమ టీ20 ఓపెనర్.. అతడే!



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన ఫ్యామిలీతో కలిసి ప్రస్తుతం లండన్‌లోనే మకాం పెట్టాడు. మార్చి 28 నుంచి ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం కానుండడంతో కోహ్లీ తన ప్రాక్టీస్‌ను ఇప్పటికే మొదలెట్టిన సంగతి తెలిసిందే. ప్రాక్టీస్‌కు సంబంధించిన వీడియోను కూడా ఇటీవలే తన సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా పంచుకున్నాడు. తాజాగా కోహ్లీ తన బెస్ట్ టీ20 ఓపెనర్‌గా విండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్‌ను ఎంచుకున్నాడు. విషయంలోకి వెళితే బెస్ట్ టీ20 ఓపెనర్‌గా టీమిండియా నుంచి కానీ, అంతర్జాతీయ క్రికెటర్ల నుంచి ప్రస్తుత, మాజీల్లో ఎవరిని ఎన్నుకుంటారని విరాట్ కోహ్లీని రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ప్రశ్న వేసింది. అయితే మొదట సచిన్, సెహ్వాగ్‌లలో ఎవరిని ఎన్నుకుంటారని అడగ్గా.. ‘టీ20 ఓపెనర్ కాబట్టి నా మొదటి ప్రాధాన్యత సెహ్వాగ్’ అని కోహ్లీ జవాబిచ్చాడు. ఆ తర్వాత ఫైనల్ చాయిస్‌లో రోహిత్ శర్మ, క్రిస్ గేల్ పేర్లు వచ్చాయి. కానీ ఇక్కడ కోహ్లీ రోహిత్‌ను కాదని ఆర్‌సీబీ మాజీ సహచర ఆటగాడు గేల్‌కే ఓటేశాడు. రోహిత్, సెహ్వాగ్ కూడా నా దృష్టిలో గొప్ప టీ20 ఓపెనర్లే అని పేర్కొన్నాడు. కానీ ఆర్సీబీ తరఫున ఆడేటప్పుడే ఓపెనర్‌గా గేల్ విధ్వంసాన్ని కళ్లారా చూశానని తెలిపాడు. ఆరంభం నుంచే బంతిని బౌండరీ లేదా సిక్సర్‌గా మలవాలన్న కోరిక గేల్‌లో బలంగా కనిపించేదదన్నాడు. అందుకే గేల్ టీ20ల్లో అత్యుత్తమ ఓపెనర్ అని చెప్పగలనని స్పష్టం చేశాడు. ఇక గతేడాది ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు కోహ్లీ ఐపీఎల్‌లో 267 మ్యాచ్‌ల్లో 132 స్ట్రైక్‌రేట్ తో 8,661 పరుగులు సాధించాడు. ఇందులో 8 సెంచరీలు, 63 హాఫ్ సెంచరీలున్నాయి. 2025 సీజన్‌లో కోహ్లీ 15 మ్యాచ్‌ల్లో 657 పరుగులు సాధించాడు. గతేడాది ఐపీఎల్ ఫైనల్లో బెంగళూరు జట్టు ఆరు పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించి తొలిసారి టైటిల్‌ను ముద్దాడింది.

# సంజు కుదురుకుంటే ..

# పవర్‌ప్లేలోనే మ్యాచ్‌ను తేల్చేస్తాడు: గంభీర్





టీ20 ప్రపంచ కప్‌లో వరుసగా మూడు హాఫ్ సెంచరీలు సాధించిన సంజు శాంసన్.. టీమ్‌ఇండియా ట్రోఫీని నెగ్గడంలో కీలక పాత్ర పోషించాడు. మొదట్లో అవకాశాలు రాకపోయినా.. తన వంతు వచ్చినప్పుడు మాత్రం ప్రత్యర్థులపై విరుచుకుపడ్డాడు. మరీ ముఖ్యంగా పవర్‌ప్లేలో హిట్టింగ్‌తో అదరగొట్టిన సంజుపై భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశంసల వర్షం కురిపించాడు. గతంలో తానూ అభిషేక్ మాదిరిగా డకౌట్‌లు అయినట్లు గంభీర్ గుర్తు చేసుకున్నాడు. ‘‘సంజు శాంసన్ ఏం చేయగలడో మనకు తెలుసు. అతడి టాలెంట్, దూకుడుపై ఎలాంటి అనుమానాలు లేవు. ఒక్కసారి కుదురుకుంటే.. మొదటి ఆరు ఓవర్లలోనే మ్యాచ్‌ను గెలిపించగలడు. జింబాబ్వేతో మ్యాచ్‌కు ముందు మేమిద్దరం కలిసి జిమ్‌లో మాట్లాడుకున్నాం. ఈ మ్యాచ్‌లో నువ్వు ఆడుతున్నావని అప్పుడే చెప్పా. ‘సరే, రానివ్వు’ అని మాత్రమే బదులిచ్చాడు. మా ఇద్దరి సంభాషణ అలా జరిగింది. ఇది కేవలం హెడ్ కోచ్‌గా కాదు.. ప్లేయర్ల మధ్య ఉండే అనుబంధం. ప్రాక్టీస్ సమయంలోనూ ముఖాముఖిగా ఇలాగే మాట్లాడుకుంటాం’’ అని గంభీర్ వెల్లడించాడు.

### అందుకే తీసుకున్నాం..

టీ20 ప్రపంచ కప్ ఆరంభంలో ముగ్గురు లెఫ్ట్ హ్యాండర్లను ఆడించాం. ఆ కూర్పును బ్రేక్ చేసేందుకే సంజు శాంసన్‌ను ఆడించామని చాలా మంది అనుకొని ఉంటారు. కానీ, కారణం అది కాదు. మరింత విధ్వంసం తీసుకురావాలనేది మా ఉద్దేశం. గత ఏడాదిన్నరగా మేం చేసిందదే. మైదానంలోకి దిగితే వేగంగా ఆడటంపైనే దృష్టిపెట్టాం. ఇప్పుడు ఆ దూకుడును ఇంకాస్త పెంచాం. అలాగే ప్రత్యర్థి జట్టు ఆఫ్ స్పిన్నర్‌ను తీసుకొచ్చిందని మేం కూర్పులో సంజును తీసుకోలేదు. టాప్ ఆర్డర్ హార్డ్ హిట్టింగ్ ఇంకా కావాలనే ప్రణాళికతో సంజును ఆడించాం’’ అని గంభీర్ స్పష్టం చేశాడు

### అప్పుడు నేను.. ఇప్పుడు అభిషేక్

‘2014 ఐపీఎల్ సమయంలో నేనూ పరుగులు చేసేందుకు ఇబ్బందిపడ్డా. వరుసగా మూడు మ్యాచుల్లో డకౌట్ అయ్యా. ఇప్పుడు అభిషేక్ శర్మ కూడా అలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నాడు. ఆ సమయంలో అభిషేక్‌కు నేను ఒకటే చెప్పా. బయట నుంచి అభిమానులు నీ స్కోర్లు చూస్తారు. నీ ఫామ్ గురించి మాట్లాడతారు. కానీ, నువ్వు ఫామ్ కోల్పోయి లేవు. పరుగులు మాత్రమే చేయలేకపోతున్నావని చెప్పా. సుమారుగా 20 లేదా 30 బంతులు ఆడి పరుగులు చేయలేకపోతేనే ఫామ్ లేదని భావించాలి. కానీ, అభిషేక్ విఫలమైన మ్యాచుల్లో ఎప్పుడూ 20 బంతులు ఎదుర్కోలేదు. ప్రతి మ్యాచ్ తర్వాత.. ఈసారి ఇంకా దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించు అని చెప్పా. అభిషేక్ నైపుణ్యంపై మాకు ఎలాంటి సందేహం లేదు. డ్రెస్సింగ్ రూమ్‌లోనూ అతడిపై మేం నమ్మకంతోనే ఉన్నాం. టీ20 ప్రపంచ కప్ కోసం బరిలోకి దిగిన ప్రతి క్రికెటర్‌పై విశ్వాసం ఉంచాం. ఆఖరికి విజేతగా నిలిచాం’’ అని గంభీర్ తెలిపాడు.

# యుద్ధ ఉద్రిక్తతలతో ఫార్ములా-1 బ్రేక్..

# బహ్రెయిన్, సౌదీ గ్రాండ్ ప్రిక్స్ రేసులు రద్దు



మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న భద్రతా ఆందోళనల దృష్ట్యా, 2026 సీజన్‌లో జరగాల్సిన బహ్రెయిన్, సౌదీ అరేబియా గ్రాండ్ ప్రిక్స్ రేసులను రద్దు చేస్తున్నట్లు ఫార్ములా వన్ యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది.

మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న భద్రతా ఆందోళనల దృష్ట్యా, 2026 సీజన్‌లో జరగాల్సిన బహ్రెయిన్, సౌదీ అరేబియా గ్రాండ్ ప్రిక్స్ రేసులను రద్దు చేస్తున్నట్లు ఫార్ములా వన్ (F1) యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, క్షిపణి దాడుల నేపథ్యంలో క్రీడాకారులు, సిబ్బంది భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. ఏప్రిల్ 12న బహ్రెయిన్ గ్రాండ్ ప్రిక్స్, ఏప్రిల్ 19న సౌదీ అరేబియా గ్రాండ్ ప్రిక్స్ జరగాల్సి ఉంది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఈవెంట్‌లను నిర్వహించడం అసాధ్యమని అధికారులు తేల్చి చెప్పారు. చైనా గ్రాండ్ ప్రిక్స్‌కు ముందే ఈ రద్దు నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం.

రేసుల సంఖ్య తగ్గింపు.. ఐదు వారాల గ్యాప్

ఈ రద్దు వల్ల 2026 ఛాంపియన్‌షిప్ రేసుల సంఖ్య 24 నుంచి 22 కి పడిపోయే అవకాశం ఉందని . ఇప్పటికే బిజీగా ఉన్న షెడ్యూల్ కారణంగా, ఈ రేసులను మళ్ళీ నిర్వహించే (Rescheduling) అవకాశం లేదని తెలుస్తోంది. ఇక, మార్చి 29న జరగనున్న జపాన్ గ్రాండ్ ప్రిక్స్ తర్వాత, నేరుగా మే 3న మయామి గ్రాండ్ ప్రిక్స్ జరగనుంది. దీంతో సీజన్ మధ్యలో ఐదు వారాల గ్యాప్ ఏర్పడింది. కేవలం F1 మాత్రమే కాకుండా.. ఫార్ములా 2, ఫార్ములా 3 , ఎఫ్1 అకాడమీ రేసులను కూడా మధ్యప్రాచ్యంలో రద్దు చేసినట్లు జాతీయ మీడియా ది ఫ్రీ ప్రెస్ జర్నల్ స్పష్టం చేసింది.